సంచిక - విషయములు - విషయ సూచిక. సంపుటము - 9
సంచిక - 8.

శ్రీ

చింతామణి.

ఇది మాసమున కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౨.] రాజమహేంద్రవరము: నందనసంవత్సర మాఘమాసము. [సంచిక ౮.

శ్రీ విక్టోరియా మహారాజ్ఞీ గారు.

ఇప్పుడు మనదేశమునకు చక్రవర్తినియై యేఁబదిరెండు సంవత్సరముల నుండి రాజ్యపరిపాలనము చేయుచున్న శ్రీ విక్టోరియా మహారాజ్ఞిగారు ౧౮౧౯ వ సంవత్సరము మెయినెల యిరువదినాలవ తేదిని జననమొందిరి. ఈమెజననకాలమునం దీమె పితామహుఁడైన మూఁడవజార్జి యింగ్లండునకు రాజుగా నుండెను. ఈమె తండ్రి మూఁడవ జార్జికి చతుర్థపుత్త్రుఁడైన కెంటుప్రభువు. ఈమె జననానంతరమున సంవత్సరమునకు తండ్రిగారును తాతగారును కాలధర్మము నొందిరి. అప్పు డీమె పెదతండ్రియైన నాలవవిల్లియము సింహాసనమెక్కి ౧౮౩౭ వ సంవత్సరము వఱకును రాజ్యపాలనము చేసెను. చిన్నతనములో మిక్కిలిశ్రద్ధతో విద్యాబుద్ధులు చెప్పించి తల్లి మొదలయినవా రీమెను బహువిషయములయందు సమర్థురాలిని జేసిరి. ఆకాలమందలి పండితులలో నగ్రేసరులైనవారిచేత నీమెకు విద్య చెప్పించిరి. ఇంగ్లీషుభాష గాక యీమె జర్మను, ఫ్రెంచి, ఇటాలియా భాషలను కూడ నభ్యసించి లాటిను భాషయం దితరసాహాయ్య మపేక్షింపక యొక మహాకవిచే రచియింపఁబడిన కావ్యమును తానే యర్థము చేసికొనునంత పాండిత్యము సంపాదించెను. స్వదేశచరిత్రములయందును, ధర్మశాస్త్రములయందును, సాహిత్యగ్రంథములయందును, ఈమె కసమానపాండిత్యము కలిగెను. ఈమె సంగీతవిద్యయందును, చిత్రలేఖనమునందును మిక్కిలి ప్రవీణురాలయి ప్రకృతిశాస్త్రము లనేకము లభ్యసించి వానిలో వృక్షశాస్త్రమునందు విశేషజ్ఞానము సంపాదించెను; కుట్టుపనియందును మహాసమర్థురాల య్యెను. చిన్నతనములో నిట్లిన్నివిద్యలను నేర్చుటయే కాక యీమె కన్నిటికి నలంకారముగా మంచి సద్వర్తనము కలదయ్యెను.

౧౮౩౭ వ సంవత్సరమున నీమె సింహాసనమునకు వచ్చినతరువాత మూఁడు సంవత్సరములకు ౧౮౪౦ వ సంవత్సరమునందు తన మేనమామ కొమారుఁడును సమానవయస్కుఁడును జర్మనీదేశములోని శాక్సుకోబర్గు గోథా దేశములకు ప్రభువు నగు ఆల్బర్టుప్రభువును వివాహము చేసికొనెను. అతఁడు విద్యయందును సుగుణసంపదయందును రూపమునందును రాణికి తగినవాఁడుగా నుండెను. అతఁడు విద్యలను కళలను ప్రోత్సాహపఱచి దేశమున కెంతో మేలు చేసెను. అతఁడు గానవిద్యయం

డును చిత్రలేఖనాది శిల్పములయందును బహుసమర్థుఁడు. వివాహమయినది మొదలుకొని యారాజదంపతు లెంతో యైకమత్యము గలవారయి పూవును తావియును వలెఁ గలిసియుండి లోకములోని దంపతులందఱును సుఖపడు విధమును దమ్మఁజూచి నేర్చుకొనవలె నన్నట్లుగాఁ బ్రవర్తించిరి. ఈరాజదంపతులకు నలుగురు పుత్రులును, అయిదుగురు పుత్రికలును పుట్టిరి. అందఱిలోను జ్యేష్ఠురాలయిన రాణిగారి పెద్దకొమార్తె నప్పటి జర్మనీ చక్రవర్తియొక్క పెద్ద కొమారున కిచ్చి వివాహము చేసిరి. ఆదంపతులకుఁ గలిగిన పుత్రుఁడే యిప్పుడు జర్మనీ చక్రవర్తిగా నున్నాఁడు. ఇప్పుడు మనకు యువరాజును రాణికి జ్యేష్ఠపుత్రుఁడు నయి ౧౮౪౧వ సంవత్సరమునందు జన్మించిన అల్బర్టు ఎడ్వర్డుగారికి డెన్మార్కుదేశపు రాజుగారి కొమారిత నిచ్చి వివాహము చేసిరి. ద్వితీయ పుత్రుఁడయిన యాల్ఫ్రెడ్డుగారి కిచ్చినచిన్నది యిప్పటి రష్యాచక్రవర్తిగారి తోఁబుట్టువు. ౧౮౬౧వ సంవత్సరమున భర్తగారు లోకాంతరగతు లయిన పిమ్మట దుఃఖసముద్రములో మునిఁగియుండి రాణిగారు కొన్ని యేండ్లవఱకును బయలికే రాలేదు. తరువాత జ్యేష్ఠపుత్రికయు కనిష్ఠపుత్రుఁడును గతించుటవలన మఱికొన్ని యాపదలు తటస్థించినవి. అటువంటి సమయములయందు సహితము రాణిగారి దయాళుత్వమునకును సుగుణసంపదకును మేర లేకుండెను. భర్తగారు కాలముచేసిన కొలదినములలో నిన్నూరుజను లొక్కసారిగా నొకసీమ బొగ్గుగనిలో పూడిపోవుట తటస్థింపఁగా, ఈసాధ్వీమణి ప్రజలదుఃఖములో తన దుఃఖమును మఱచిపోయి మృతుల భార్యలను తల్లులను ఓదార్చుచు తంత్రీవార్తను రెండువేలరూపాయలను బంపెను. సముద్రములయం దోడలుపగిలిగాని, అయోమార్గములయందు బండ్లుపడిపోయికాని, అగ్నిభయ సాంక్రామిక రోగాదులచేతఁగాని యెంతదూరదేశమునందు జనోపద్రవము కలిగినను రాణిగారుపచారపత్రికలను వ్రాసి తోడుచూపుచుందురు. ఆమె యప్పుడప్పుడు తనరాష్ట్రములోని బీదల గుడిసెలకు సహితముపోయి వారి యోగక్షేమములు విచారించుచును, బీదలకు ధనదానమును రోగుల కౌషధదానమును జేయుచు, అటవస్త్రములను తానుకుట్టిన బట్టలను గొనిపోయి పల్లెలలోని పిల్లల కిచ్చుచునుండును. ఆమె మనదేశముమీఁది ప్రేమచేత పాంచాలదేశస్థుఁడయిన రామసింగను శిల్పిని ౧౮౯౧వ సంవత్సరమునం దింగ్లాండునకుఁ బిలిపించి తమ రాచనగరయిన ఆస్బరన్ మందిరమున నొకటెక్కుగా హిందూ రాజసభా భవనమునంటి సభాగృహము నొకదాని నాతనిచేత క్రొత్తగాఁ గట్టించినది. ఈ మహారాజ్ఞి చిరకాల మారోగ్యైశ్వర్య సంపదలతో వర్ధిల్లును గాక!

నీతికథలు.



తాఁబేలును కుందేలును.

ఒకనాఁడొక తాఁబేలు మెల్లగాఁ బ్రాకుచుండఁగాఁ జూచి కుందేలొకటి దాని వద్దకువచ్చి దాని నడకను పరిహసించెను. అందుమీఁద తాఁబేలునకు రోషమువచ్చి, పందెమువేసినయెడల నీతోసమానముగా నేనును పరుగెత్తఁగలనని కుందేలుతో తాఁబేలుపలికెను. ఆమాటలకు నవ్వి మంచిదని కుందేలు పందెమునకొప్పుకొని, ఒక క్రోసుదూరములోనున్న మఱ్ఱిచెట్టువద్దకు పరుగెత్తవలెనని చెప్పెను. అపయిని ప్రయాణమయి కూర్మము మెల్లగా కాళ్ళీడ్చుకొనుచు నడువనారంభించెను; చెవుల పిల్లి వాయువేగమున పరుగెత్తి నిమిషకాలములో నరక్రోసుదూరము చేరి, వెనుక తిరిగి చూచి తాఁబేలించుమించుగా బయలుదేఱినచోటనే యుండుట కనిపెట్టి, అదివచ్చు లోపల నింతలో నొకనిద్రతీసి తరువాత మరల పరుగెత్తవచ్చునని యెంచి యొక చెట్టునీడను పరుండి సుఖముగా నిద్రపోయెను. కుందేలీప్రకారముగా గాఢనిద్ర పోవుచుండఁగా తాఁబేలువిడువక మెల్లగానడిచి సంకేతస్థలమును జేరి పందెమును గెలిచెను. కుందేలంతటమేల్కని యులికిపడి లేచి తొందరగా పరుగెత్తెనుగాని యాలోపలనే కార్యము మించిపోయెను.

గీ॥ నడుమ విడువక పనిసల్ల నడుపువారె
కార్యసిద్ధిని గాంతురుగాని, మంచి
తఱిని నిద్రించి తరువాతఁ దమకపడుచుఁ
బరుగులిడువారు ఫలసిద్ధిఁ బడయరెపుడు.



ఎద్దును బండిచక్రములును.

సరకులతో నిండిన బరువుబండి నొకదానిని బలమున్న యెద్దొకటి లాగుకొని పోవుచుండఁగా వెనుకవైపునుండి చెవులు గీపెట్టునట్టుగా బండిచక్రములు కిఱ్ఱుకిఱ్ఱుమని ధ్వనిచేయసాగెను. అప్పుడావృషభము వెనుకకుఁ దిరిగిచూచి "ఇంత బరువును వహించి నేను మాటాడక యీడ్చుకొని పోవుచుండఁగా, ఊరక మీరఱచెదరేమి?" అని యడిగెను.

గీ॥ కష్టపడనట్టివారు లోకంబుతోడ
మొఱ్ఱపెట్టరు తమ కష్టములను గూర్చి;
వట్టివారలె యఱతురు మిట్టిపడుచు.
గొడ్డుగేదెల కఱపులు గొప్పకావె?



తెవులుగొంటు దుప్పి.

పూర్వమొకప్పు డొకదుప్పి రోగముచేత వేతకయి దూరము నడవలేక యొక పచ్చికబయల పరుండి మెల్లమెల్లగఁ బ్రాకుచు, అందిన గడ్డిపఱకలు మేయుచుండెను. ఇంతలో దానిచుట్టములన్నియు బ్రతిదినమును దానిక్షేమమును విచారించుటకయి వచ్చుచు పోవుచునుండి యక్కడి గడ్డియంతయు మేసిపోయెను. ఆదుప్పి యందుచేత మేతదొరకక రోగమువలనఁ గాక బంధువుల యాదరమువలననే పస్తుపడి చచ్చిపోయెను.

గీ॥ వసుధలో బంధువర్గ మీవరుసగానె
పరామర్శకివచ్చి బాధింత్రు చుట్టములను;
వారుచేయు సాయంబు దైవంబె యెఱుఁగు;
పాడగు గృహస్థు వారి మేపంగలేక.

(౩౦౮-పుట శేషము.)

ఆది నేటివఱకును పారశీ కులస్థులవలనఁ బ్రచురింపఁబడు పత్రికలలోఁ బ్రాముఖ్యతవహించి వారివృద్ధికి మిగుల సహాయభూతమయి యున్నది. నౌరోజీగారికిఁ జిన్నవయసునందుఁ దల్లిగారుచేసిన మేలునకుఁ గృతజ్ఞతాసూచకముగా స్త్రీల విద్యాభివృద్ధికై నౌరోజీగారు మిగుల పాటుపడుచుండిరి. హిందూస్త్రీలకుఁ గలిగిన స్వాతంత్ర్యములు మొదలగువానికి ఆయనయే కారణభూతులయి యున్నారు.

౧౮౪౫ వ సంవత్సరమునందు ప్రొఫెసర్ ఆర్లిబార్ దొరగారు నౌరోజీగారు "హిందూదేశమును వృద్ధిపరుపఁదగినవాఁ"డని సెలవిచ్చిరి. వారికోరిక నేటికి సఫలమయినది. తరువాత లండన్ లివర్‌పూల్ పట్టణములలో స్థాపింపఁబడిన హిందూ వర్తకశాలలలో మొదటిదియగు కామాకంపెనీలో భాగస్థుఁడుగాఁ జేరి నౌరోజీగారు ఇంగ్లాండునకుఁ బోయిరి. ఆకాలములోఁగూడ స్వదేశాభివృద్ధికై యనేక సంఘములను స్థాపించి పాటుపడుచుండెను. ప్రజల యభివృద్ధికై నౌరోజీగారు స్థాపించిన సంఘములను పూర్తిగా వ్రాయుట మిగుల కష్టతరమైన పనియైనను కొన్నిటి నీక్రింద వ్రాయుచున్నాము. "విద్యార్థుల యభివృద్ధి కేర్పరుపఁబడిన సభ" బొంబాయినగరములోని శరీరసాధకముకొఱ కేర్పరుపఁబడినశాల, ఫ్రేమ్‌జీకావేసుజీ పాఠశాల, స్వదేశస్థుల పుస్తకశాల, విక్టోరియా చిత్రవస్తు ప్రదర్శనశాల మొదలగువానిని అనేకములుగా స్థాపించి వృద్ధిపరిచెను. హిందూవితంతువుల పునర్వివాహవిషయమునుగూర్చి విశేషముగా చర్చఁజేసి యతిబాల్యవివాహములవలనఁ గలుగు చెడుగులను వెల్లడిచేసెను. ౧౮౭౪ వ సంవత్సరములో బరోడా రాజ్యమునకు దివానుగా నియమింపఁబడెను. ఆకాలములో శేటు గైకవార్ మల్హారురావుగారి యవివేకపు పరిపాలనవలన రాజ్యమంతయు పాడై రాజకీయవ్యవహారములన్నియు మిగుల విచారకరమయిన స్థితిలో నుండెను. మ్యునిసిపల్ వ్యవహారములోగూడ నౌరోజీగారు పండితులు. మ్యునిసిపల్ కవున్సిలులోనుండి బొంబాయి రాజధానిలోని నగర పారిశుద్ధ్య శాసనములను సవరించుటలో మిగుల సహాయభూతుఁడాయెను.

౧౮౮౫ వ సంవత్సరములో నౌరోజీగారు బొంబయి శాసననిర్మాణసభలో నొక సాంఘికుఁడుగా నేర్పరుపఁబడెను. ఆయన శక్తిసామర్థ్యములు మిగుల శ్లాఘనీయములు. హిందూదేశపు రాజ్యతంత్ర విషయములలో నాయన మిగుల తెలిసినవాఁడు.

ఆయన మిగుల పొట్టివాఁడుగాని అంతరంగము విశేషమయినది. నేత్రములు మిగుల సుందరమయినవి. ముఖము మిగుల ప్రకాశమానమయినది. దూరదేశములకుఁ బ్రయాణము చేసిన ఆంగ్లేయునివలె నౌరోజీగారి శరీరచ్ఛాయ విశేషము

నలుపుకాదు. వాక్కు దృఢమయినదియు స్పష్టమయినదియు నయి యున్నది. ఆయన వాగ్ధోరణి మిగుల విశేషమయినది. ఆయన మాటాడు ప్రతివిషయమును గూర్చియు ఆయనకు బాగుగఁ దెలియును. వినువారికి మిగుల సొంపుగానుండును. ఈయన ఇంగ్లాండుదేశములో సుమారు ముప్పదిసంవత్సరములనుండి వాసము చేయుచున్నారు.

చిన్నతనమునుండియు దాదాభాయిగారు తమ శక్తిసామర్థ్యములను జూపుచుండిరి. స్వదేశపుపాఠశాలలో నాంగ్లేయవిద్యయందును స్వభాషయందును నారోజీగారు తోడిబాలురకంటె మిగుల ప్రవీణులయి యుండిరి. దొరతనమువారి పాఠశాలలోఁ జదువుకొనుచుండినపుడు నోటి లెక్కలలో నారోజీగారి సహపాఠి యొకరు బహుమతి నందుకొనెను. అందులకు నారోజీగారు మిగుల వ్యసనపడి గణితశాస్త్రమందు విశేషముగా కృషిచేసి సంవత్సరాంతమున నియ్యఁబడు బహుమానముల నందుకొని తనతోడిబాలునికంటె మిగుల మెప్పువడసెను. ఈయన చిన్నతనములో "దాదీ" అని పిలువఁబడుచుండెను. "పశ్చిమహిందూస్థాన" మను గ్రంథములో నీయనను గూర్చి పోష్టరుదొరసానిగా రీప్రకారముగా వ్రాసిరి. "ఈచిన్న పారసీ పిల్లవానికి నుదురు బహు విశాలమయినది. నేత్రములు ప్రకాశమానమైనవి. చూచినవారందరికిని మిగుల సంతోషము గలుగఁజేయును. తమ తరగతిలో నుపాధ్యాయుఁ డొకప్రశ్నను వేయఁగానే ముఖముపై చేయుంచి కొంచెము సేపు ఆలోచించి తరగతిబాలు రందరికంటెను శీఘ్రముగా జవాబు చెప్పును. ఈపిల్లవానికిఁగల బుద్ధికుశలతనుబట్టి ప్రపంచములో విశేషముగా వృద్ధినొందఁగలఁడని నేను తలచెదను. విశేషాధిక్యమును బొందవలెనను తలంపు ఈచిన్నవానికి మెండుగాఁగలదు" అని పోష్టరు దొరసానిగారు సెలవిచ్చియున్నారు. ఇంగ్లాండునకుఁ బోవుటకు నారోజీగారి బంధువు లియ్యకొనినందున ఎలిఫిన్‌ష్టన్ శాస్త్రపాఠశాలలో సహాయపండితుఁడుగా నియమింపఁబడెనని చెప్పియున్నాము. ఆయనతోఁగూడ సహోపాధ్యాయులుగా నున్నవారందరు నీయనయొక్క బుద్ధికుశలతనుగూర్చి విశేషముగా శ్లాఘించియున్నారు. ప్రొఫెసర్ (శాస్త్రపండితుఁడు) పనికి నియమింపఁబడినవారిలో నొక బొంబయి పట్టణమునందే కాక హిందూదేశమంతలోను నారోజీగారే మొదటివారు. ౧౮౪౯-౫౦ సంవత్సరములలో విద్యావిషయ కార్యనిర్వాహక సంఘమువారు వ్రాసిన రిపోర్టులో నీయన యుద్యోగమునుగూర్చి ఈప్రకారము వ్రాసియున్నారు. "మేము చేసిన యేర్పాటులలో దాదాభాయిగారిని గణితశాస్త్రములలోను సృష్టివిషయములలోను పండితులుగా ఖాయపరిచితిమి. ఈసంగతి మాకందరకు మిగుల సంతోషకరముగా నున్నది. ఇదివరకు పయి యుద్యోగముతోఁ జేరినపనులను

రెండుసంవత్సరములనుండి నౌరోజీగారు మిగుల తృప్తికరముగా నెరవేర్చుచున్నారు. చిరకాలము పాటుపడి గణితశాస్త్ర ప్రవీణులై యిప్పుడ పొందిన గౌరవమును బట్టిచూడఁగా నిఁకముందుగూడ నౌరోజీగారు విశేషమయిన ఖ్యాతిని సంపాదింతురని మేము దృఢముగా నమ్ముచున్నాము. బొంబయిరాజధానికి గవర్నరుగానుండిన ఘనతకెక్కిన మవుంట్ స్టూవర్టు ఎల్ఫిన్‌స్టన్ ప్రభువుగారియెడల పశ్చిమ హిందూస్థానమందలి ప్రజలకుఁగల కృతజ్ఞతను సూచించుటకై ఏదైన నొకపనిని చేయవలయునని యిరువదెనిమిది వత్సరములక్రింద మేము ఉద్దేశించితిమి. అందునుగూర్చి ౧౮౫౬వ సంవత్సరము ఆగష్టు నెలలో జరిగిన సభలో సాంగ్లేయభాషయు, శాస్త్రములు మొదలగు పశ్చిమఖండ విద్యలను బోధించుటకు శాస్త్రపండితోద్యోగముల నేర్పరుచుట యుక్తమని నిబంధనచేసిరి. ఇట్టియుద్యోగములకుఁ దగిన హిందువులు కూడ కొద్దికాలములోనే బయలుదేరవచ్చునని సంఘమువారా సమయమందు ముచ్చటించిరి. ఆకోరిక నేటికి ఫలించినదికావున నౌరోజీగారిని గణితశాస్త్ర సృష్టిశాస్త్రములలోఁ బండితునిగా నియమించుటకు మేమెంతయు సంతసిల్లితిమి" అని రిపోర్టులో వ్రాయఁబడినది. మఱియొక సమయమునందు విద్యావిషయ కార్యనిర్వాహక సమాజమునకుఁ గార్యదర్శిగారైన డాక్టర్ యూకుస్టోవిల్ దొరవారు నౌరోజీగారికి వ్రాసిన యుత్తరములో నీప్రకారము వ్రాసిరి. "మీరిప్పుడు ప్రవర్తించుచున్న విధముగా ముందుకూడ ప్రవర్తించినయెడల శీఘ్రకాలములోనే మీదేశమునకు భూషణమగుదురని" దొరవారు వ్రాసిరి.

నౌరోజీగారు స్వదేశస్థుల క్షేమము నిమిత్తము చేసిన పనులను కొన్నిటిని పైన చెప్పియున్నాము. అందులో ముఖ్యముగా స్త్రీలవిద్యాభివృద్ధి కొరకు మిగుల పాటుపడెను. బాలికాపాఠశాలలకు తండ్రియని నౌరోజీగారిని స్నేహితులందరు పిలుచుచుండిరి. స్త్రీలకు విద్యగరపవలెనను నుద్దేశము కలిగినప్పుడు దానిని నెరవేర్చుటకై ప్రథమములో విద్యార్థులందరును వారియిండ్లయొద్ద పాఠశాలలను స్థాపించి యుదయమున బాలికలకు విద్యగరపుచుండిరి. దాదాభాయిగారు చేసిన పనులన్నిటిలోను, స్వదేశస్థులను తనకు సహాయభూతులుగా నున్నవారిని మిగులగౌరవించి వారివలన తిరిగి విశేషగౌరవమును పొందుచువచ్చెను. ఇంగ్లాండునందలి పారశీ శాసనవిచారణ సంఘము దాదాభాయిగారియొక్కయు, నౌరోజీ ఫర్దంజీగారియొక్కయు కృషివలన మిక్కిలి వృద్ధినొందెను. దాదాభాయి నౌరోజీగారు స్వదేశస్థుల శాస్త్రవిషయ సంబంధమైన సంఘమునకు సభ్యులుగా నుండిరి. ౧౮౪౮వ సంవత్సరములో బాలురవిద్యావిషయమయిన సభకూడ నీసంఘములోఁ గలిపిరి. ఏత

త్సంఘమునకు నౌరోజీగారుపాధ్యక్షులుగా నుండిరి. ఆయన నాలుగైదుసంవత్సరములు గుజరాతీ జ్ఞానప్రకాశసంఘమునకు నధ్యక్షులుగాను రహనామామజ్ దియస్నాసంఘమునకు రెండుమూడుసంవత్సరములకుఁ గార్యదర్శిగాను పనిచేసిరి. బొంబయిలోని సంఘములలో నొకసాంఘికుఁడుగానుండి విశేషముగా వృద్ధిపరచెను. పారసీకదేశములోనున్న పారసీల యుపయోగముకొఱకు నేర్పరుపఁబడిన ఇరానీఫండును వృద్ధిపరుచుటలోను ఫోర్టుధర్మాసుపత్రి విషయములోను మిగుల శ్రద్ధతో పనిచేసి చక్కఁ పరచెను. పారసీల దేహపరిశ్రమ విషయమయి మిగులపనిచేసి దానివిషయమయి కొన్ని నిబంధనల నేర్పరచెను. లార్డు కానింగు ప్రభువుగారిపేరిట నొక వర్తకకూటము (Fellowship) నేర్పఱుచుటకు ప్రయత్నించెను కాని యాకాలమందలి వర్తకపుచిక్కులవలన నాప్రయత్నము కొనసాగదయ్యెను.

మొదటిదఫాను బారొనెట్ (బిరుదు) అను బిరుదునొందిన సర్ జమ్సెట్ జీజీజీభాయిగారి పటము నొకదానిని కట్టించుటకు నౌరోజీగారు మిగులఁ బ్రయత్నము చేసిరి. ఘనతకెక్కిన జగన్నాథ్ శంకరశేట్ గారి పటము నొకదానిని కట్టించిరి. గుజరాతీభాషలో ప్రచురింపఁబడు సమాచారదర్పణము దినపత్రికకు ౧౮౫౧వ సంవత్సరము మొదట నౌరోజీగారు వ్రాయుచు "సాక్రొటీసునకును డయాజినీసునకును సంభాషణ"యను పేరిట ననేకసంగతులను ప్రచురించుచువచ్చెను. "రస్తుగఫ్తార్" అను పత్రికకు వ్రాయుచువచ్చిరని పైన చెప్పియున్నాము. ఆపత్రికకు రెండుసంవత్సరములవరకు జీతములేకుండ వ్రాయుచు తరువాత తమకు తీరికలేని హేతువుచేత జీతమిచ్చి యొకలేఖకుని నియమించిరి. ఆయన భాషాపరిజ్ఞానము బహు విశేషమయినది. జ్యోతిశ్శాస్త్రము మొదలగువానిని గురించి జ్ఞానప్రకాశికయను పత్రికకు వ్రాయుచు విద్యార్థుల యుపయోగముకొఱకు ననేకోపన్యాసముల నిచ్చుచుండెను. సర్ జమ్సెట్ జీజీజీభాయి గారి వేదాంత విద్యాశాలయందు జ్యోతిశ్శాస్త్రమునుగూర్చి నౌరోజీగారొకప్పు డుపన్యసించిరి. రహనుమామాసంఘమునకుఁ గార్యదర్శిగానుండి యందలకధ్యక్షులైన నౌరోజీ ఫర్దన్జీగారికి మిగుల తోడ్పడి వారి పత్రికలు మొదలగు వానికి సహాయభూతుఁడయి యుండెను. స్వదేశపుస్త్రీలను సభలు మొదలగు బహిరంగమైన స్థలములకుఁ దీసికొనిరావచ్చునా కూడదాయను నంశమునుగూర్చి దేశస్థులందరు నాలోచించుచున్నప్పుడు పూర్వకాలములో నన్ని దేశముల స్త్రీలయొక్క స్థితినిగూర్చి నౌరోజీగారొక యుపన్యాసము వ్రాసి ప్రచురించిరి. ఇంతకష్టపడి పనిచేయుచు తీరికయైనప్పుడితరభాషల శ్లోకములు నేర్చుకొనెను. ఆయనకు నాంగ్లేయభాషయందేకాక ఫ్రెంచి, పారసీకము, హిందూస్థానీ, గుజరాతీ, మరాఠీభాషలలోఁ గూడ విశేషపరిశ్రమము కలదు. [సశేషము.]

అ. సుందరరామయ్య.

ప్రభావతీప్రద్యుమ్నము, చతుర్థాశ్వాసము. (౩౧౦-పుట శేషము.)

ఉ॥ వావిరి నెల్ల ప్రౌఢత భవత్పరిరంభణ చుంబనాది నా
నావిధ భోగలీలల మనంబున నువ్విళులూరుచున్కి ప్ర
భావతి చెప్పెఁ గొన్నినిశలం గనుమూసిన యంతమాత్రఁ జి
పై విలసిల్లు కుట్మలితభావవిశేష విజృంభణంబులన్. ౭౫.

మ॥ కలలం గూడినవేళ నెట్టి పొలయుల్కల్ పుట్టెనో యేమి నీ
వలనం దప్పుఘటిల్లెనో యెఱుఁగఁ దత్స్వప్నాగమామర్ష వి
హ్వలిత స్వాంతయపోలె నిద్ర నెరయన్వర్జించెఁ బద్మాక్షి య
క్షు లహోరాత్రములందుఁ బక్ష్మకుముదస్ఫూర్తి న్విడంబింపఁగన్. ౭౬.

క॥ చిత్తజ మహాగ్నికాఁకల । నెత్తుదఱిగి వన్నెయెక్క నాతయునెమ్మే
న త్తరుణికి జనులందఱుఁ । బుత్తడిబొమ్మ యనుమాట బొంకేలయగున్. ౭౭.

సీ॥ రోలంబనికురుంబ నీలిమశ్రీఁబోలె వేణిముట్టుట కడువిరసమయ్యె
సమదకోకిల శుకస్వరసామ్యమునఁబోలె సఖులసల్లాప మసహ్యమయ్యెఁ
బరిపూర్ణ చంద్రబింబసమత్వమునఁబోలె నిలువుటద్ద మదర్శనీయమయ్యెఁ
బ్రసవాస్త్ర వివిధమార్గణ వర్ణధృతిఁబోలె రత్నభూషాళి యుగ్రాహ్యమయ్యె
వేయుఁ జెప్పఁగ నేల నీవిలాసనంబు । లెల్లమునఁ దలపోయుట యొకటిదక్క
బహుదినంబులనుండి యాపడఁతి కితర । వస్తురుచులన్నియును గానివానియయ్యె.

క॥ వెదకికొని తానె యిటురా । మది సాహసమొంద కదలు మాటికి నీరూ
పెదుటఁ దనకంతఁ దోఁచిన । మదిరేక్షణ తత్తరిలుచు మగుడున్ లజ్జన్. ౭౯.

క॥ ఆపడఁతియుఁబలెఁ జేసెను । జూపఱనప్పుడేమి చెప్ప శోషిలుచుఁగదన్
నీపత్రిక యానిమిషము । లోపల రాదేనిఁ జాటిలు దశాంతరమున్. ౮౦.

వ॥ ఆపత్రిక యుపకారంబునుం దాత్కాలికస్థితి కారణంబగుట యొక్కటియ కాని యక్కన్యకు మిక్కిలిం దాపంబు గావించుచున్నయది యెట్లంటేని. ౮౧.

క॥ క్రిందటిదివసములు విరహద । శం దానలఁగుటయకాని సరిగ నిప్పుడు నీ
వుం దనకై కుందుటవిని । యొందరుణికి నింక నిమిష మేఁడై తోఁచున్. ౮౨.

ఉ॥ భావనచేసిచూడ క్షణభంగుర మీ తులతార్తి కల్తి వా
తావిల పల్లవాంచల హిమాంబు కణంబును నంతకంటె మే
ల్గావున నింక నెంత యవిలంబమునం గృపసేగి ప్రోచెదో
దేవరచిత్త మాసతియదృష్టము వేయును జెప్పనేటికిన్. ౮౩.

వ॥ అనినవిని యతండు. ౮౪.

క॥ గ్రక్కునఁజని ప్రాలుమనో । జెక్కలుగట్టుకొని దివిజరిపు మేడలపై

నళోత్కటమ్మఁ జూచు చెప్పు దెప్ప। దోత్కటయనునంత తమకమున్నది మదిలోన. ౮౬

గీ॥ ఏమి సేయుదు నా దైత్య నియ్యకోలు
లేక వీఁ డెవ్వరికిఁ జోర రాకయునికి
యరసి వేఁగుచు నున్నాఁడ నమరపతియు
హరియుఁ దలపోయు కార్యమేమయ్యెఁ జెప్పుమ. ౮౭.

వ॥ అనిన శుచిముఖి యతనిం జూచి యోకుమారక నీకుఁ దత్పురప్రవేశచింత వల దది తదుపాయంబు హరి నిశ్చయించుకొని యున్నవాఁడు వజ్రనాభవధకార్యంబునకు నేను భవదిష్ట సాధనానుకూల్యంబు చింతించి నిన్నే యనుపునట్లుగాఁ జేసితి వాసుదేవుం డిపుడ యేతదర్థంబు నిన్నుఁ బిలిపించి యనుపుచున్నవాఁడు వజ్రికి నిది యెఱింగించి వజ్రపురంబున కరిగి యేనును దగిన తెఱంగున నం దావశ్యక కార్యానుగుణ్యంబు నడుపుచుండెద నని పలికి యతని వీడ్కొని చనియె నప్పుడు॥

సీ॥ అమరారికరుల కుంభములు వ్రయ్యఁగ మొత్తు రమణిచన్నులు నఖాగ్రముల నొత్తు
నమరరాతుల రథచక్రంబు లిలఁ గూల్పఁ గాంతశ్రోణికి నూడిగంబు సల్పు
నసురేంద్రజయశంఖ మవనిపై ద్రోయింపఁ గామినికంఠంబు గౌఁగిలింప
వజ్రనాభుని ధనుర్వ్యాప్తులు గడతేర్పఁ బడఁతి కన్బొమసంజ్ఞఁ బనులొనర్ప
దైత్యమెఱుఁగుఁదూపులు దళితములు సేయఁ
దత్తనూజ చూపులు ఫలితములు సేయ
నుదుటుఁదనమును వలపు నొండొంటితోడ
దంటగొని క్రమ్మ నెమ్మది దాల్చె నతఁడు. ౮౮.

సీ॥ అంతట గోవిందుఁ డతనుని గద సాంబులను బిలిపించి యలంఘ్యదర్పు
వజ్రనాభుని బ్రహ్మవరబలోద్ధతుని దేవహితార్థమై త్రుంపవలయుటయును
దన్మహత్త్వంబును దత్పట్టణప్రవేశం బన్యులకు నసాధ్యంబగుటయుఁ
దానమరాళిచేఁ దగ ఘటింపించిన తదుపాయమును విశదముగఁ జెప్పి
యందు రుక్మిణీసుతుఁడు భద్రాఖ్యరూపు
గదుఁడు పారిపార్శ్వకుని యాకారము మఱి
సాంబుఁడు విదూషకుని ప్రకారంబుఁ దాల్చి
చనఁగ నియమించి పంపెను దనుజపురికి. ౮౯.

గీ॥ ఆముగురు పరశ్వరావిదితస్వప్రియాంగనా సమాగమానుగుణతఁ
బ్రమదమొందిరపుడు ప్రత్యేకమీయాత్ర। నాదుభాగ్యవిలసనంబయనుచు. ౯౦.

సీ॥ వనములనెట్లుబ్బుచును నటవేషంబు ధరియించి తమకునుదగినయట్టి

వారసీమంతినీ వ్రాతంబుగొలువ వైణికవైణవికమౌరజికజనాది
నాట్యసామగ్రియుఁ భద్రమన కెట్టిది యట్టిదయై కనుపట్టుచుండఁ
గదలియథోచితగతిఁ బయనంబులు వర్తిల్లఁగా జేగి వజ్రపురము
ప్రాంతమునను శోభానగరములయందు విచిత్రచూపట్టు మేళంబు విడిసివిడిసి
యతివిచిత్రంబులగు తమయాటచేర్పుల నెల్లనెల్ల నపరికలుమవార్త కెక్కుచుండె. ౯౧.
క॥ వసువేంద్రుఁడు తద్వార్తలు । విసుమంతె హృదయమునఁబొదలు వేడుకతో వా
రిని బిలిపించెను వారును । జని యాదవుజనకు సుచితసమయమునందున్. ౯౨.
క॥ తమ నాట్యవిద్యఁజూపఁగ । సమకట్టి తదర్హమైన సన్మానవిశే
షముతో ఁ దనగు దెంచిరి । రమణదలిర్పంగ నృత్యరంగస్థలికిన్. ౯౩.
వ॥ శుచిముఖి యటమున్న తనపలికిన క్రమంబున వచ్చి వజ్రనాభుని యాదరంబు
వడసి ప్రవర్తిల్లుచుం బ్రభావతికిం జంద్రవతి గుణవతులకుం దత్పతుల రాక తెలిం
గెలిగించి వియోగతాపంబున మిగుల నొగులకుండఁ దదాశాశీతలోపచారంబున
సేదదేర్చుచునుండి యుప్పుడెల్లెలించిన ప్రద్యుమ్నుని క్షణక్షణప్రవర్ధమాన ప్రభా
వతీ రాగవృత్తాంతంబున నౌత్సుక్యంబుఁ జేయుచుచు నతిగాఢంబుగా రాకపోకలు
గావింపుచుఁ నిక్కం జేసి యతనితోఁ నేఁడు నీహృదయవల్లభ నీనాట్యంబు చూడ
వచ్చునని చెప్పి తదాగమనీయ హర్మ్యస్థలంబునుం జూపిపోయె నంత. ౯౪.
సీ॥ వజ్రనాభుఁడు రాజ్యవైభవం బెంతయు మెఱసి నానాబంధుమిత్రసచివ
సంఘంబుతోఁ ద నాస్థానమహామంటపమునందు నౌడ్డోలగమునసుండి
పరులదృష్టికి నగోచరమగు సంవృతస్థలినిల్చి రాణివాసపుజనంబు
చూచునట్లుగఁ జేసి సొంపారువేడ్కతో సావధానస్వాంతుఁడగుచుఁ జూడ
సంనిహితరంగమంగళాచారుఁడగుచు । సురహితముగమాయానాట్యసూత్రధార
వృత్తిగైకొని శంబరద్వేషియొనరెఁ । బూర్వరంగప్రవర్తన పొందుపఱుప. ౯౫.
వ॥ అప్పుడు. ౯౬.
శా॥ గాంధారప్రముఖస్వరశ్రుతి కళాగంభీరవారాంగనా
గాంధర్వంబు ఘనస్వనంబు తతనిక్వాణంబు వంశాది సం
బంధిస్వాన పరంపరామహిమయున్ మద్దెళ్ళ దిందింధిమిం
ధింధోంధిక్కి ధిమిక్కిశబ్దభరమున్ దీపించ నాపూర్ణతన్. ౯౭.
సీ॥ సరవిఁ జంచత్పుట చాపపుటోద్ఘట్ట షట్పితాపుత్రక సంజ్ఞలమర
వెలయుచుండెడు సమవిషమ తాళప్రవృత్తులునాల్గు ప్రస్తారకలనవలనఁ
గలుగు నానాతాళములు యథోక్తస్ఫూర్తిఁ బరగు నేలాదిప్రబంధచయముఁ

దత్తదర్పస్థాన దత్తపటాక్షర బిరుదాదికాంగ విస్ఫురణదనర
తుతిఁ జతుర్దశముద్రక గీతభేదములు దురాపంబులంద్రదు వర్తిలెనవియును
నిఖిలకళలునుగల రాక్షిణేయుశిక్షవలనఁ దన్నాట్యకర్మప్రవర్తనమున. ౯౮.

ఉ॥ ఆ వనజాక్షనందనుఁడు నంతటనాంది దగంబఠించి యుం
పావళిలంబ్రరోచనయు నాముఖముం దనరారనొప్పఁ బ్ర
స్తావనతో ముఖాదులగు సంధులు సాంగతఁ జెప్పుమీఱ గం
గావతరాదినాటకము లాడెననేకము లద్భుతంబుగన్. ౯౯.

సీ॥ ఆనాటకప్రయోగావసరముల భగీరథాద్యాకార ధారణమును
గంగాదికిమ్నగాగతియుఁ గైలాసాదినగకల్పనమును నానావనప్ర
పంచనంబును బహుపక్షిమృగాది జంతువిశేషరూపవృత్తులును మఱియు
నెచటికెయ్యదియోగ్య మచటఁ దత్తద్వస్తుసృష్టిసన్నిదము వేసియును గృతక
మగుటనిశ్చయింపఁగలేక యబ్రపడుచుఁ జూచి సామాజికులు తమసొమ్ములెల్ల
నొసఁగులుగనైవ నడపుచు నొప్పమీఱె రుక్మిణీసుతుండు మాయానిరూఢి మెఱసి॥

వ॥ ఇవ్విధంబున నాత్మీయ దివ్య మాయాప్రపంచ సముదంచిత నాట్యవంచితులం
గావించి నక్తంచరుల ధనసంచయంబు నూఁచముట్టుగా దోఁచుకొనుచుం నాచు
ఖేచరులకు వేడ్కఁబుట్టించె. ౧౦౧.

మ॥ ప్రియకాంతామణిచూడ్కికిన్ నిజవపుశ్శ్రీతోనలోఁచెన్ మహా
నయమాయానిధి రుక్మిణీసుతుఁడు నానాభూమి కాధారణుం
డయి భద్రుండయి పౌల్పువేళ నహిమాయాయామ సంభావ్య మ
న్తియటంచు న్నృపులాడుమాట మదిఁ జింతింపంగ బొంకేలగున్. ౧౦౨.

శా॥ ఆభవ్యం దిటమున్నొకొక్కనెప మొప్పార న్నరాళిప్రది
ష్టాభిజ్ఞాన గవాక్షలక్ష్య దనుజాధ్యక్షాత్మజా వక్త్రశ్రీ
శోభద్రంబును సారెకుం దనకుఁ గల్గం జేసికొంచున్ని న
ట్లాభామామణి చింబ్రభుసూతి విలీనార్థంబుగా నిట్లనున్. ౧౦౩.

చ॥ సకలవిశేషశోధనకుఁ జాలిన యోనెఱజాణ వజ్రనా
భకులవతంసరత్నమ ప్రభావతిరోహిత కంటకంబు తా
వకమగు చూపు నాపయిఁ బ్రవర్ధిత రాగతఁబర్వఁగా నన
ల్పకలుషవృత్తి నాసుకృతమంతయు నేఁడుసుమీ ఫలించుటల్. ౧౦౪.

గీ॥ నీకు నామీఁదఁగలయట్టి నెయ్యమును మహోదరము నీవుపనిచిన హంసి చెప్ప
నాత్మలో ననవరత నాట్యప్రసంగమున నినుభజించు వేడుక ఘనము నాకు. ౧౦౫

క॥ ననుఁ నేలికొను మవశ్యం|బును నీయూడిగము చిత్తమునఁ గైకొనఁగ నే
నొనరింతు నేఁటితమి నీ|మనమున నెంతయు నిడుకొని మన్నింపఁదగున్. ౧౦౬.

క॥ అనవిని కపోలయుగళము| ఘనపులకితముగ నరల్పఁ గ్రక్కున నాత్మా
ననము ప్రభావతి యాలో|కన జాలకమునకు నెడఁగఁ గదులజ్జ మెయిన్. ౧౦౭.

చ॥ అపుడు తదీయపార్శ్వగత యైన మరాళవధూటి దానవా
ధిపతనయం గనుంగొని మదింగనుఁగొంటివె యాత్మనాథు వా
క్యపదవిఁ దోఁచునట్టి యితరార్థము సర్వము నాననాబ్జముం
ద్రపనిటు త్రిప్పి తింతి గరుడాల్చెఁ గపోలముచాల నాపుడున్. ౧౦౮.

క॥ విచ్చలవిడి ననుఁ జేర్కొని| యిచ్చను గల చెల్లఁబలికె యిదె నేఁటినిశ
న్వచ్చెద ననుచున్నాఁడిఁక| నిచ్ఛామతి యర్థమెద్ది యితరము దీనన్. ౧౦౯.

క॥ ఎవ్వరు వినుటకుఁ గైకొనఁ| డివ్విధుఁ డిది యేమిభ్రాంతి యెట్లైనాకో నా
కెవ్విధి ప్రాప్తమొకో యని| నివ్వెఱపడి యింతతడవు నిలిచితి వినుచున్. ౧౧౦.

వ॥ అనుడు శుచిముఖి యాశశిముఖి నీక్షించి. ౧౧౧.

మ॥ అతివా యన్నిటఁ జాణ నీమగఁడు నీ కాచింత యుక్తంబుగా
దతఁ డర్థద్వితయోక్తి నీకు నుచితంబైనట్టు నీకున్ సభా
పతికర్హంబగు రీతి నాతనికిఁ దోఁపం బల్కె నాఁడేది నీ
మతిఁ దోఁచెం బ్రకృతంబుగామిఁ బరులాత్మం గానరా యర్థమున్. ౧౧౨.

క॥ సకియా నానార్థోక్తుల| నాక నియమము తెలియ మర్థ ముచితంబె చో
టికె నెద్దియదియ యచోఁ| బ్రకటము హరిశ్రీవిభుఁడను పల్కునఁ బోలెన్. ౧౧౩

వ॥ కావున నీవల్లభుండు నిన్నుఁ బలికిన పలుకు లన్యశతేఁ గిరో యను శంక విడుము మఱియు నితరులకు నాట్యావసానసమయ సముచిత స్తోత్రప్రకరణ బలంబునఁ దోఁచుచున్న యర్థాంతరంబు చేతఁ బ్రభువు నుపచరించి యిదె యతని చేతఁ దన విడిదికి ననిపించుకొని చనుచున్నవాఁడని పలికె శుచిముఖి యంతం బలికినట్లు సేయు ఱెక్కఁ జేయుం జూపి తనతలంపు యథార్థంబగుట తార్కాణించె నట్లు విహగ మహిళారహస్య సంభాషణ రసానుభవంబున విభాసిల్లు ప్రభావతియు రాగ వల్లరీ సహితంబుగా గృహంబునకరిగి ప్రియసమాగమ త్వరమాణమానస యగుచుండె నంత. ౧౧౪.

ఉ॥ ఎప్పుడు వచ్చెఁ గాంతుఁ డినుఁ డెప్పుడు గ్రుంకు నటంచు నాత్మలో
ముప్పిరిగొన్న రాగము సముత్కటమై కనుదోయి కుబ్బఁగాఁ
దొప్పఁగఁ దోఁగుచూడ్కిని వధూమణి సారెకుఁ జూడఁగాఁ జపా
యిప్పలుపాండె నీతఁడన హేళి క్రమంబునఁ దాల్చె రక్తిమన్. ౧౧౫.

ఉ॥ అంబుధిలోనికిం దటను హంసుఁడు డిగ్గ దినాంత మజ్జనా
ర్థంబునుబోలె నట్టియెడఁ దత్తటినాటఁగఁ గట్టినట్టి ర
క్తాంబరమో యనంగఁ దనరారెఁ గడుం గడసంజ తీవి యం
తం బొడసూపెఁ దారకలు తత్పతనోద్గత బిందులో యనన్. ౧౧౬.

క॥ తోరపుఁ జీఁకటులంతన్। సూర్యోత్సవకలనమునకు మదిఁ బొంగుచు ది
గ్నారీజనులాడెడి క।ర్పూరి వసంతములయొప్పు చొప్పున నెరసెన్. ౧౧౭.

వ॥ అంత. ౧౧౮.

క॥ ఐరావణ కరికరధూ। త్కార నవమధురేణుపటలి కైవడిఁ గుర్కు
లారి దిశఁ దెలుపుతోఁ జెను। దారలు ప్రథమోద్ధబిందు తతిగతిఁ బరగెన్. ౧౧౯.

వ॥ తదనంతరంబ. ౧౨౦.

చ॥ శిశిర త్రియామముఖున్నగవు దిద్దికొనంగఁ బురోదిశాలి వా
గవిసెన వెల్వరించు మణికల్పిత దర్పణమో యనంగఁ గై
రవకులబంధుమండలము రాజిలెనోలిని లియ్యమానమై
మిపులఁ గళంకలక్ష్యతఁ దమిప్రతిబింబము నంత నేర్పడన్. ౧౨౧.

గీ॥ తామరసలక్ష్మి లాచందమామరాక। కలగుచును గుముదాళికై తొలఁగెనపుడు
తొలఁగు బావయె కాఁడె తమ్ములవరించు। నట్టి సతులకు నతఁడెంమున్నెట్టిఁడైన.

చ॥ పసుపడవేణునాళములఁ బగ్గములంబలెఁ గ్రిందఁబర్వ శో
భన కిరణప్రకాండములు భాసిలఁ జందురుఁడొప్పె నెంతయున్
మనసిజుఁ డెల్లప్రాణుల మనంబులు చేలుగ రాగబీజము
ల్వైనుజలతనంబుతోడ వెదఁజల్లెడు రాప్యపు జడ్డుగంబనన్. ౧౨౩.

చ॥ నెలయను పెండికుండఁ గడునిండి నిశాఖ్య చకోరనేత్ర యిం
పలరఁగ నంబరాహ్వయ మహానటమూర్తి మహాభిషేకమున్
జలుపఁగ నెల్లదిక్కుల వెసం బ్రవహిల్లెను పాలవెల్లి నాఁ
బొలిచె సమస్తముం జలువఁ బొంద నమందత సాంద్ర చంద్రికల్. ౧౨౪.

చ॥ తొలఁకెడు హంసకాంతుల విధుద్యుతిఁ ద్రోచి చకోరమైత్రి జో
కలు మెఱయించు కన్గవల కల్కితినంబునఁ బుప్పలావికల్
తలఁపులు గొల్లలాడి మిగులన్భ్రమయించి యుపవ్రజంబుచే
జెల లధికంబుగాఁ గొనుచు వేషుకనమ్మిరి పుప్పులంగడిన్. ౧౨౫.

గీ॥ అప్పుడు ప్రభావతికి నాక్కయుసివ విరులు
గొనుచుఁ బోవఁగ నంద నింపునఁ జరించు

వేఁటికి గమిలోనఁ దానొక్క- వేఁటకాఁడుగ
నేఁగ మాయామనుండు రతీశ్వరుండు. ౧౨౬.

వ॥ అట్టియున్న వరిసవ్యాగమోత్సవ సముత్సాహంబునం జేసి యపరాహ్ణంబున నుండి యుం గ్రీడాభవన పర్యంకాది సముచిత నూతన సత్క్రియావిశేష సంపాదనంబునకుం దగిన పరిచారికల నియోగించుచున్న ప్రభావతి మనోరథం బెఱిఁగి రాగవల్లరి యతిప్రయత్నంబున. ౧౨౭.

క॥ చెలువకు సంపెఁగనూనెం। దలయంటి సుగంధవాసితములగు చూర్ణం
బులనలుగుఁ బెట్టి గంధా।మలకంబిడి చిమురుదీర్చి మజ్జనమార్చెన్. ౧౨౮.

చ॥ చెలికి మెఱుంగుఁబావడలచేఁ దడియార్చియు ధూపవాసనల్
వలకొలిపి నృత్తసూన సదలంకృతి మీఱఁగ వేరువేర మె
చ్చులరసి కీలుగంటు జడ సక్కియు త్రేలుడుఁగొప్ప మూడుమూ
లల బిగికొప్పు పెక్కుగతుల న్నలిపెం బలుమాఱు విప్పుచున్. ౧౨౯.

వ॥ అప్పుడా రాగవల్లరి ప్రభావతినుద్దేశించి. ౧౩౦.

చ॥ విరిసిన నొక్కయొప్పు నరపిడిన వేఱొకయొప్పుఁ జిక్కునా
టారసిన నొక్కయొప్పు నదియార్చిన వేఱొకయొప్పు వేణికా
వరచన నొక్కయొప్పు ముడివైచిన వేఱొకయొప్పు కొప్పుగాఁ
బరగిన నొక్కయొప్పుఁ గనుపట్టెడు మానిని నీకచంబులన్. ౧౩౧.

క॥ తెఱవా సందిట సందేడు। వెతివెంట్రుక లాయతములు నీలములినిదే
తెలిఁగున్న ముడిచిననీకున్। గొఱఁతగలదె యుపియ జట్టిగొను నీవిభునిన్. ౧౩౨.

క॥ అనుచు నివిరు ల్కచబంధం। బునఁ జెరివెడు సఖిని మరలి పోలఁతుకవై చెం
దనచేతి పువ్వుబంతిని। గినుకయుఁ జెఱువవ్వుఁ గన్నుఁగ్రేవలఁ దోలఁకన్. ౧౩౩

వ॥ అంత. ౧౩౪.

సీ॥ అని చెలువ యతుకర్దమం బాదిగాఁగఁ।గలపముల భేదములు దనవలసినట్లు
సంఘటింపించి కుంకుమచందనాదు। లలఁది నిలిపించుకొనియె మేలరసియరసి.

సీ॥ మృగమదాదుల దొక్కబొట్టిగనె యాకు।బొట్టు పూర్ణచంద్రతిలకంబు నెలవంక
విధము నామము గుమ్మడివిత్తునామ। మొకటిగాదని యొకటి యాయువిదదాల్చె.

గీ॥ వెలఁదిపట్టెలు పిల్లాండ్లు పీరమద్ది।యలును నందెలు మొలనూళ్ళునంగుళీయ
కంకణాంగదహార తాటంకముఖ స।మస్తభూషణములు దాల్చె మార్చిమార్చి.

క॥ ఒక్కొకతోయము సొమ్ములె। పెక్కుఁదెఱంగులవి యునికి పెంపున నవియొం
డొక్కటి మీఱు మఁ దనప్రభ। నెక్కుడగుటఁ ద్రిప్పి త్రిప్పి యుంతిధరించెన్.

ఉ॥ అంచల పట్టొకింతతడ వట్టుచు మంజిడికొంతసేపుఁ గ్రొ
మ్మించుజరంగువల్వఁ గడు మేలిమి మాదళముల్పవంతు లో
క్కించుక యుంచు కొంతవడి యుంపున నొక్కటి మెచ్చకొక్కటిం
జంచలనేత్ర దాల్పఁ బ్రియసమ్మత మెట్లగు నొక్కొ యటన్న దిక్. ౧౩౯.

చ॥ తరుణి యొకింత సేపు చిలుఁదమ్ములపుంబసతోడి మోవి మే
గరగరికన్వరాజలుచుఁ గమ్మలుఁదీఁగెయుఁ బూనివేణికా
సురభితఁబొల్చి యొక్కపరిశుద్ధపు సైకపుటొల్లెగట్టి భా
సురతఁ గనుంగ్వలాల్పఁ జెలిసొమ్ములకోపమి యన్నిపంబునన్. ౧౪౦.

వ॥ వల్లభ మనస్సమాకర్షణ కౌశలాకౌశల సందేహంబునం జేసి యొందును మనస్థై
ర్యంబు చాలక మఱియును. ౧౪౧.

ఉ॥ శ్రీలలితాంగరాగములుఁ జీరలుసొమ్ములు నేర్చిరేర్చితా
మేలుతరంబుఁదాల్చియును మెచ్చకమార్చుచు నెన్నిమాఱులుం
జాలక దిద్దినట్టి నిరు సారెకు దద్దుమ మించుటద్దమున్
గేలధరించిచూచుఁ బరికించుఁ బొరింబొరి సద్మసంస్క్రియల్. ౧౪౨.

సీ॥ కేళీగృహంబు ముంగిట గరగరిక లాలోకించు గంధాంబుసేకమరయు
నలుకుఁబ్రాఁతల పరిమళముఁ బరీక్షించు రంగవల్లికల తెఱంగుఁజూచు
సకినలమంచంబు జాడవిమర్శించుఁ గుంకుమపరపు భంగులుగణించు
మెఱుంబట్టుతలగడ యొప్పువిచారించు నగరుధూపముల సోయగము లెంచు
నలరుటోవర్లు మేల్కట్లునంగరాగ। పూర్ణపాత్రికలును గందవొడిభరణులు
జాలవల్లికలాదిగా సముపభోగ। సాధనశ్రీలు పరికించు సారెకబల. ౧౪౩.

వ॥ ఇట్లువర్తించుచున్న యన్నీలవేణి యాపువ్వు లాదరంబునం బుచ్చుకొనిరె యెట్టి
రొదనెట్టునట్టుఁ జెదరిపఱచు తుమ్మెద పదువు పొదివదలి యొదిగి యనుకుమారుం
డక్కుమారిక నవరించు శ్రవణోత్పలంబులోనం గానరాకుండ నడంగి
యుండె నప్పు డప్పడంతి మున్పిరిగొను రాగవేగంబునఁ బ్రియాగమన విలం
బంబు సహింపలేక బహిఃప్రాణంబు లనఁబొప్పు శుచిముఖీ రాగవల్లరుల నేకతంబు
నకుం బిలిపించి శుచిముఖి కిట్లనియె. ౧౪౪.

శా॥ రాఁడయ్యెన్ హృదయేశుఁ డీహృదయభారం బెట్లు సైతున్ క్షణం
బేఁడై యున్నది యేటికింపడ సెసెనో యేవిఘ్నముల్పుట్టెనో
నేఁడే తెంచు ప్రయత్నమున్న నకటా నీతోడఁ జెప్పండె యే
వ్వాఁడీరీతి యొఱింగెనో యపుడు నన్వాక్రుచ్చి యట్లాడఁగన్. ౧౪౫.

పింగళి-సూరన్న.

ఆంధ్రకవులచరిత్రము, మధ్యకవులు. (౩౩౮-వ పుట శేషము.)

అయ్యలరాజు రామభద్రుఁడు.

ఈకవి యాఱువేల నియోగిబ్రాహ్మణుఁడు; తిప్పయార్యుని ప్రపౌత్రుఁడు; పర్వతన్న పౌత్రుఁడు; అక్కయార్యుని పుత్రుఁడు. ఈతఁడు కడపమండలములోని యొంటిమెట్ట గ్రామములోఁ బుట్టి పెరిగినవాఁడు; పరవస్తు మున్నదీవరదాచార్యుల శిష్యుఁడయి వైష్ణవమతాభిమానమును గలిగియుండినవాఁడు. ఇతఁ డొంటిమెట్టలో నున్నకాలములో నచ్చటి వీరరాఘవస్వామిమీఁద నొకశతకమును జేసెను. ఇతఁడు మొట్టమొదటఁ గృష్ణదేవరాయల యంతిమదశలో విజయనగరములోఁ బ్రవేశించి కృష్ణదేవరాయనిచేతఁ దద్విరచితమయిన సకలకథాసారసంగ్రహమును తెనిఁగింపఁగోరఁబడెను. కాని గ్రంథపూర్తి కాకముందే కృష్ణదేవరాయలు పరమపదము నొందినందున రామభద్రకవి గ్రంథము నాతని కంకితము చేయక యవతారికయందుఁ గృష్ణదేవరాయల ప్రార్థనచేతఁ దానాగ్రంథమును రచించితినని మాత్రము వ్రాసెను. ఈసకలకథాసారసంగ్రహము శ్రీరామపురూరవశ్చరిత్రాదులనుగల తొమ్మిదియాశ్వాసముల గ్రంథముగా నున్నది. ఈగ్రంథమునందును రామభద్రకవి సూక్ష్మబుద్ధి గలవాఁడని యూహించుటకుఁ దగినమార్గము లనేకములు గానఁబడుచున్నను, కవిత్వము ప్రౌఢముగాక వ్యాకరణదుష్టమును బాలవిరచితమని సూచించుచున్నది. ౧౫౩౦వ సంవత్సరమున కొకటిరెండేండ్లు ముందీకవి గ్రంథరచన కారంభించినట్లు తోఁచుచున్నది. ఈకవి సకలకథాసారసంగ్రహము యొక్క యవతారికయందుఁ దాను గ్రంథరచన చేయఁబూనుటనుగూర్చి యీక్రిందిపద్యమును వ్రాసియున్నాఁడు:—

ఉ॥ నన్నయ తిక్కనాది కవినాథులు చెప్పినయట్లు చెప్పలే
కున్నఁ దదుత్తరాంధ్రకవు లూరకయుండిరె తోఁచినట్లు ని
త్యోన్నతబుద్ధిఁ గబ్బములు యోజరచింపకె ముందు జ్ఞానసం
పన్నుల కావ్యముల్ హరిసమర్పణమైఁ జెలువొందు నెందునన్.

ఈ బాలకావ్యమయిన సకలకథాసారసంగ్రహమునుగూర్చి యింక విస్తరించి వ్రాయక యందలిపద్యములను మాత్రము రెంటిమాటి నిందుదాహరించుచున్నాను—

సీ॥ కానకకన్న సత్పుత్రుండు నేఁటికిఁ గానకకన్న సత్పుత్రుఁడయ్యెఁ,
బుణ్యజనోత్కర్ష పురుషుండు నేఁటికిఁ బుణ్యజనోత్కర్ష పురుషుఁడయ్యె,
ద్విజముఖ్యులనుగూడి తిరుగుబాలుఁడు నేఁడు ద్విజముఖ్యులనుగూడి తిరుగుటయ్యె,
గోత్రపావనుఁడైన కొమరుండు నేఁటికి గోత్రపావనుఁడైన కొమరుఁడయ్యె,
మత్తగజదానధారార్ద్రమార్గములను। దరులనీడల నెప్పుడుఁ దిరుగువాఁడు
మత్తగజదానధారార్ద్రమార్గములను। దరులనీడల నెప్పుడుఁ దిరుగుటయ్యె.

చ॥ చదువు వివేకమూలమని సద్గురుసన్నిధి ధర్మశాస్త్రముల్
చదివి సుధాకరుండు నిజసద్గురుపత్నిని దా రమించుటన్
జదు వవివేకమూలము సంభవమయ్యె నదేమనందు నా
మదనమహత్త్వమెన్న నసమానపరాక్రమ మెన్నిభంగులన్.

చ॥ వినుత నిజాంఘ్రుల న్విడిచిపెట్టక పట్టుక నేలవ్రాలి తే
వనిగయుకున్నరుండు బలుబాసల నమ్మికలిచ్చి యాదరం
బునఁ గరమంది లేవనిడి భూతదయాంచిత మానసోన్నతిన్
దనరిన యాత్మవంశకథనంబు వచించిన లేచెవాఁడొగిన్.

సకలకథాసారసంగ్రహమును ముగింపకమునుపే కృష్ణదేవరాయలు మృతినొందినంకున, ఆదరించు ప్రభువులులేక బీదవాఁడయిన రామభద్రకవి యందందుఁ దిరిగి గుత్తి యప్పలరాజు మొదలైనవారి నాశ్రయించి వారిమీఁదఁ జాటుపద్యములను జెప్పుచుఁ గొంతకాలము జీవనము చేసి, కడపట కృష్ణదేవరాయని యల్లుఁడయిన రామరాజుయొక్క మేనల్లుఁడగు గొబ్బూరి నరసరాజువద్దఁ జేరి తాను తరువాత రచియించిన రామాభ్యుదయము నారాజున కంకితము చేసెను. ఈకవి గుత్తి యప్పల రాజుపయిని జెప్పిన చాటుపద్యమొకటి యిందుక్రిందఁ బొందుపఱుచుచున్నాను—

క॥ రాజమనోజా! విద్యా। భోజా! దీనార్థి కల్పభూజా! రిపుసం
ఘాజా! వైభవ విజిత బి।డౌజా! రవితేజ! గుత్తి యప్పలరాజా!

ఈకవి చిరకాలము జీవించి బహుసంతానవంతుఁడయి దారిద్ర్యముచేత బాధపడిన వాఁడు. ఈతని సంతానాధిక్యమునుబట్టి యితనిని జనులు పిల్లల రామభద్రయ్య యనియు పిలిచెడువాడుక గలదు. ఇతఁడు కృష్ణదేవరాయని యాస్థానకవియన్న పేరేకాని యీతని కాలమంతయు నించుమించుగా నా రాయని యనంతరముననే గడపఁబడినది. ఇతఁడు కొంతకాలము పింగళి సూరన్నకును, తరువాత రామరాజభూషణునకును సమకాలికుఁడుగా నుండి కృష్ణదేవరాయల మరణానంతరమున నించుమించుగా నలువదియేఁబది సంవత్సరములు బ్రదికి ౧౫౮౦వ సంవత్సర ప్రాంతమునందు మృతినొందెను. ఈతఁడుచేసిన గ్రంథములలో రామాభ్యుదయము ముఖ్యమయినది. ఇదిమిక్కిలి ప్రౌఢమయిన కవితాధోరణికలదయి, పదగుంభనము నందు పాండురంగమాహాత్మ్యమును బోలి యమకానుప్రాసములను గలదిగా నున్నది. ఈకవి ప్రారంభదశయందుఁ గృష్ణదేవరాయల దర్శనార్థముగా విజయనగరమువచ్చి నప్పు డూరిబయట రామరాజభూషణుని శిష్యు లొకపద్యమును గుర్వాజ్ఞానుసారముగాఁ జెప్పఁబూని కుదురక యాలోచించుచున్నట్లును, వారు చలిచేత వడఁకుచు

నచ్చుటకు రాఁ బ్రస్థించిన యాకవికి చలిమంటవేసి కప్పుకొన బట్టనిచ్చి యతనిచేత

"సీ॥ మోహోపదేశ తమోముద్రితములైన కనుదమ్ముల హిమాంబులను పరాదు,
శ్రమబిందుతారకాగమ ఖిన్నకుచకోకములఁ జంద్రనామంబు దలఁపరాదు,
శీర్యదాశావృంత శిథిలతాను లతాంత మసియాడ వీవనల్విసరరాదు,
పటుతాప పుటపాక పరిహీణ తనుహేమమునకుఁ బల్లవపుటార్చిడఁగరాదు,
లలన కానంగకేళి కీలాకలాప। సంతతాలీఢ హృదయపాత్రాంతరాళ
పూరిత స్నేహపూరంబు పొంగిపొరలఁ। జల్లని పటీరసలిలంబు చల్లరాదు."

అను పద్యమును చేయించి తాము రచియించిన పద్యమునుగాఁ జెప్పి తమ గురువునకు సమర్పించినట్లును, రామరాజభూషణుఁ డాపద్యముయొక్క చమత్కృతికి సంతోషించి దానిని తన వసుచరిత్రమునందు చేసికొన్నట్లును, ఒక పుక్కిటి పురాణము కలదుగాని యది యెంతమాత్రమును విశ్వాసపాత్రమయినది కాదు. కృష్ణదేవరాయల కాలములో రామరాజభూషణుఁడు కవిత్వమును జెప్పుట కారంభించినట్లే కనఁబడకపోవుటచేత నాతని కప్పటికే శిష్యుఁ డుండ మున్నదన్నవార్త యసంబద్ధముగుటను బట్టియు, వసుచరిత్రము కృష్ణదేవరాయల యనంతరమున ముప్పదియైదు సంవత్సరములవఱకును బ్రకటింపఁబడకపోవుటచేత నంతటి మహాప్రౌఢగ్రంథమును రచించిన రామరాజభూషణుఁ డొక్కపద్యమును రచించుట కశక్తుఁడయి యంతకాలమునకు తరువాత నితరకవియొక్క పద్యమును దనదిగాఁ దనపుస్తకమునందుఁ జేర్చుకొనె ననుటకంటె హాస్యాస్పదమయినమాట వేఱొకటిలేకపోవుటను బట్టియు, ఈ గ్రంథచౌర్యకథ కల్పనానిపుణులదే కాని కవిదికాదనుట స్పష్టము.

రామభద్రకవియొక్క కవితాపటిమను జూచి రామరాజభూషణుఁడు మాత్సర్యగ్రస్తుఁడయి యతఁడు చేసిన రామాభ్యుదయముయొక్క ద్వితీయాశ్వాసములోని "సింహనఖాంకురచ్ఛిన్నే" త్యాది పద్యమును జదివినప్పుడు "పృథులషడ్జస్వరోద్గీత భిల్లపల్లవాధరా గీతికాకర్ణనాతిభీతి పరవశాత్మపటీర కోటరకుటీరలీనఫణి" యనుచో వీణానాదమునకు ఫణులు బెదరుట స్వభావవిరుద్ధమని తప్పుపట్టెననియు, దానిపయిని రామభద్రకవి నెమలియొక్క షడ్జస్వరముచేతఁ బాములు భయపడుట స్వభావసిద్ధమేయని సమాధానము చెప్పి యాతని గర్వభంగము చేసెననియు, మఱియొకకథ చెప్పుదురు. ఆమొదటికథ యెంతసత్యమైనదో యీరెండవకథయు నంతసత్యమైనదే. కొంచెము మంచిగ్రంథమును రచియించిన కవి కెల్ల నతనియిష్టదేవతయో సరస్వతియో వచ్చి గ్రంథరచనము చేసిపెట్టినట్లుగా మనలోఁ జెప్పుకొనెడు వాడుక ప్రకారముగా రామభద్రకవికిని రాజునొద్దఁ దా నాఱునెలలలో గ్రంథమును

జేసి తెచ్చెదనని ప్రతిజ్ఞపట్టి తేలేకపోయినప్పుడు మిత్తి పెట్టిన కడపటిదినము రాత్రి యాతని యిష్టదైవమయిన శ్రీరామమూర్తియే రామాభ్యుదయమును జేసిపెట్టి కవి యొక్క మానము కాపాడెనని జనప్రతీతి యొకటి కలదు. సకలకథాసార సంగ్రహము నందున్న రీతి పద్యములే యనేకము లీరామాభ్యుదయమునందుఁ గానఁబడు చున్నవి. వానిలో నొక్కదాని నిం దుదాహరించుచున్నాము—

సీ॥ కానకకన్న సంతానంబుగావునఁ గానకకన్న సంతానమయ్యె,
సరయు గోత్రనిధానసై తోఁచుఁగావున సరయు గోత్రనిధానమయ్యె నేఁడు,
ద్విజకులాదరణ వర్ధిష్ణుఁడుగావున ద్విజకులాదరణ వర్ధిష్ణుఁడయ్యె,
వివిధాగమాంత సంవేద్యుండుగావున వివిధాగమాంత సంవేద్యుఁడయ్యెఁ,
గటకటా దాశరథి సముత్కటకరీంద్రకటకలిత దానధారార్ద్రకటకమార్గ
గామి యెట్లు చరించు నుత్కటకరీంద్రకటకలిత దానధారార్ద్రకటకతటుల.

ఈకవి శేష శకట రేఫముల భేదమును పాటింపక యతిప్రాసములయందు యథేచ్ఛముగా మైత్రి కలుగఁజేసినవాఁడు. ఈతని కవిత్వరీతిని దెలుపుటకయి రామాభ్యుదయములోని కొన్ని పద్యముల నిందు వ్రాయుచున్నాము.—

చ॥ ప్రమదమెలర్ప నుగ్రమృగబాధ హరింపఁగ వేఁటమై నర
ణ్యమునకు రా నఘంబొదవె నక్కట! 'ధర్మమె చాలుఁ గుక్కఁబ
ట్టుము' నటు రొంచి విల్లటు తటుక్కన ధారుణిపైచి సారమే
యముల మరల్పఁబంచె మృగయాక్రియమాని విభుండు ఖిన్నుఁడై.—అ. ౨.

ఉ॥ అక్కట! కోసలక్షితివరాత్మజ కానకకన్నముద్దు లేఁ
జక్కని మంచురాకొమరుఁ జంపరుఁ డెక్కడ? యధ్వరావనం
బెక్కడ? దైత్యసంహరణమెక్కడ? ఘోరవనాంతరశ్రమం
బెక్కడ? యెట్టులంపుమని యెమ్మని? నోరెటులాడె నింతకున్?—అ. ౪.


ఉ॥ వింధ్య మధిత్యకాకటక విస్ఫుటపాదప పుష్పగుచ్ఛ సౌ
గంధ్యము హేమధాతుమయకల్పితసంధ్యము బద్ధమేరు సా
గంధ్యము చండకేసరి నికాయనిరాకృత భద్రదంతి ద
ర్పాంధ్యముఁ గ్రుంగఁద్రొక్కెలి మహాగుణభూషణ సత్యభామ దా.—అ. ౫.

ఉ॥ చూచుటలే దశోకవనిఁ జొచ్చి యటుంజని చూచెదంగదా!
యాచపలాక్షి మజ్జనని యచ్చటనుండినయేని లెస్స లే
దా చతురాననుండు మొదలైన సుపర్వు లెఱుంగఁ జిచ్చులో
వైచెదఁగాక యీమొదలు వానరవీరుల ప్రోలవైతునే?—అ. ౬.

జంతుస్వభావచరిత్రము. (౩౪౨-పుట శేషము.)

(౩౪౨-పుట శేషము.)

నక్క.



నక్కయొక్కయాకారము పయిపటమునందుఁ జూపఁబడి యున్నది. ఈ దేశమునందెల్లవారును నక్కనుజూచియుందురు. ఒకవేళ నక్కను జూడనివారు కొందఱున్నను వారు సహితము రాత్రులయందు దానియూళపాటలకర్ణకఠోరముగా వినియుందురు. నక్కటక్కులనుగుఱించి యీదేశపు పుస్తకములలో ననేక కథలు వ్రాయఁబడియున్నవి. నక్క యించుమించుగా కుక్కంతయుండి బహుగుణములయందు కుక్కనుపోలియుండును. నక్కలు పగటిపూట నొంటిగాఁగాని జంటలుగాఁగాని మాత్రమే వాసముచేసినను చీఁకటిపడఁగానే గుంపులుగాఁజేరి చెవులు చిల్లులుపోవునట్లుగా నఱచుటకారంభించును. తోడేళ్ళవలెనే యివియు రాత్రించరములేయయినను పగటిపూటకూడ నప్పుడప్పుడు సంచారము చేయును. ఇవి సమస్తవిధములయిన శవములను తినుటయేకాక తామువట్టుకొనఁ గలిగిన చిన్న మృగములను పక్షులను జంపితినును. మాంసాహారము దొరకనప్పుడవి పండ్లుమొదలయినవితిని జీవించును. ఇవి గ్రామసమీపములయందు వాసముచేయుచు సమస్తమృతకళేబరములను తినుచుండుటచేత మనుష్యుల కుపయుక్తములు. అయినను రాత్రులయందిటి కోళ్ళగుడిసెలలోదూరి కోళ్ళనుదొంగిలించుటచేతను, అప్పుడప్పుడు మేకపిల్లలను గొఱ్ఱెపిల్లలను నోరవ్రేసికొనిపోవుటచేతను, మనుష్యులు గ్రామములలోనికి వానిరాక నపేక్షింపరు. తెవులుగొట్టయిన మేకలను గొఱ్ఱెలను గాయపడినలేళ్ళను కూడ వెంబడించి నక్కలు బ్రతికియుండఁగానే వానిని పట్టుకొని తినును. అవికొన్ని

సమయములయందు తోటలలో ప్రవేశించి చెఱకుకఱ్ఱలను మొక్కజొన్నపొట్టలను విఱుచుకొనితినును. నక్కలు సింహములకును వ్యాఘ్రములకును మంత్రులుగానుండి యవి తెచ్చుకొన్న మాంసములో భాగమును పొందునని చెప్పుదురుగాని, అదినిజమైనను కాకపోయినను నక్కలు వ్యాఘ్రము మొదలయినవానిని వెంబడించి యవిచంపి తినివిడిచిపోఁగా శేషించిన జంతువుల డొక్కలు మెక్కుట గలదు. అంతేకాక యొకానొకప్పుడు పులులు మొదలయినవి నక్కలు గుంపుకూడి మృగములను వేటాడువఱకును వేచియుండి తరువాతఁ దాము పిలువనిపేరంటముగావచ్చి నక్కలను పాఱఁదోలి చంపఁబడిన మృగములను భక్షించిపోవుటయు, ఏజంతువులును దొరకనప్పుడు నక్కలనే పిండారగించుటయు, కూడఁ గలదు. కొన్ని నక్కలకు కొమ్ములుండునని యు, నక్కకొమ్ములు చేతనుంచుకొనువారికి కార్యసాఫల్యము కలుగుననియు, ఈదేశమునందు జనులు నమ్ముచున్నారు. యుద్ధయాత్రలు మొదలయినవి చేయునప్పుడు నక్కలుకూయుట యశుభసూచకమనియుజనులుభావించుచున్నారు.

కుక్కల నుసికొల్పినప్పుడు నక్కలు బహుదూరము పాఱిపోవునుగాని జాగిలములు వానిని శీఘ్రముగానే పట్టుకొనును. అయినను నక్కల ప్రాణమొకపట్టునఁబోక చిరకాలము శరీరమునంటి పట్టుకొనును. కొన్నివేళలయందు నక్కలు తాముచచ్చి పడిపోయినట్టునటించి వేటకానిని జాగిలములనుగూడ మోసపుచ్చి తప్పించుకొని పాఱిపోవును. నక్కలు తోడేళ్ళవలెను కుక్కలవలెను ఇంచుమించుగా రెండుమాసములు గర్భమును ధరించి నాలుగేసి పిల్లలవఱకును పెట్టును. తోడేళ్ళకును కుక్కలకును కంటె నక్కలలోను కుక్కలలోను సంబంధబాంధవ్యములధికముగానుండును. అరణ్యప్రాంతములయందలి గ్రామములలోని నక్కలను పోలినకుక్క లనేకములు నక్కల కుక్కల పెండ్లివలనఁ గలిగిన సంతతియేయని జంతుశాస్త్రజ్ఞులు తలఁచుచున్నారు. కుక్కలకువలెనే నక్కలకును వెఱ్ఱియెత్తుట కలదు. వెఱ్ఱినక్క కఱచిన పక్షమున విషమెక్కి మనుష్యులును మృగాదులునుకూడ పిచ్చియెత్తి బాధపడి చచ్చుట సంభవించును.

గుంటనక్క.

నక్కకంటె గుంటనక్క మిక్కిలిచిన్నది. ఇది గుంటలుత్రవ్వుకొని వానిలో వాసముచేయుటచేత గుంటనక్కయనఁబడును. దీనికే కొంకనక్కయని మఱియొక పేరుగలదు. గుంటనక్కలు రాత్రిచరజంతువులు. ఇవి పగలెల్లను బొరియలలోను పొదలలోను దాగియుండి యాహారనిమిత్తము రాత్రులు బయలువెడలును. నక్కలవలెనే వీనికిని తోఁకజల్లితోఁకగానుండును. ఇవియెప్పుడును నక్కలు మొదలయినవాని

వలె గుంపులుకూడియుండవు ఇవి బూడిదరంగుకలవిగానుండును. క్రింది భాగములయందు బొచ్చు తెల్లగానుండును. సన్నముట్టెమీఁద కంటిదిగువను నల్లనిమచ్చ యొకటియుండును. తోఁకమీఁది వెండ్రుకలు నల్లగానుండును. కొంకనక్క చొరవ గలదయి యెప్పుడప్పుడు తోఁటలలోనికిని దొడ్లలోనికినికూడ వచ్చుచుండును. ఇది పక్షులను బల్లులు తొండలు మొదలయినవానిని తినిబ్రతుకును. దీనివద్ద మాయలును ఉపాయములును పెక్కులుగలవు. ఇది యొకానొకప్పుడిండ్ల యావరణములలో రాత్రులుప్రవేశించి కోళ్ళగూళ్ళక్రిందనుండి బొక్కలు త్రవ్వి కన్నపు దొంగవలె లోపలఁ బ్రవేశించి కోళ్ళను బాతులను దొంగతనముగా నెత్తుకొని పాఱిపోవును. అయినను గుంటనక్క యెప్పుడో కాని కోళ్లుమొదలయిన పెంపుడుపిట్టలజోలికిరాక సాధారణముగా బల్లులు, ఎలుకలు, మిడుతలు, పీతలు మొదలయినవానితో పొట్ట పోసికొని తృప్తినొందుచుండును. ఇది పుచ్చకాయలు మొదలయినపండ్లను, కాయ ధాన్యములనుకూడ భక్షించును. ఈనక్కబొక్కలు సామాన్యముగా బయలిమీఁదనేయుండి వానిమార్గములు వర్షాకాలములో నీరులోపల చొరకుండునట్లుగా చెలువుగట్లు మొదలయిన యున్నత ప్రదేశములమీఁది కుండును. ఒక్క నక్క బొక్కకు దారులనేకములుండునుగాన గుంటనక్కలను పట్టుకొనుటకయి కుక్క యొకదారిని దూరఁగా నక్క మఱియొక దారిని పాఱిపోవును. పాఱిపోయెడిదారి యడవిలోనికో రాళ్ళలోనికో యుండును. ఈసంగతిని కనిపెట్టి నక్కవేటకాండ్రు గుంటనక్కలు రాత్రులు మేతకుఁబోయినప్పు డొక్కదారినిమాత్రముంచి తక్కిన దారులను పూడ్చివేసి మఱి నక్కవేటాడుదురు. కొంకనక్క విగ్రహమీప్రక్కపటమునందుఁ జూపఁబడినట్లుండును. ఇదిపెంచినపక్షమున మచ్చికపడివినోదకరముగానుండును. ఇవిస్థలభేదములను బట్టి కార్తికమాసము మొదలు



పుష్యమాసము వఱకును చూలాండ్రగుచుండి మాఘమాసము మొదలు చైత్రమాసము వఱకును నాలుగేసి పిల్లలచొప్పున బొరియలలోనే యీనుచుండును. కోపము వచ్చినప్పుడు దీనిదేహమునుండి యొకవిధమయిన కంపుబయలుదేరును.

అడవికుక్క.

హిందూదేశమునందలి యరణ్యములలో నొకవిధమయిన యడవికుక్కలు గలవు. ఇవి నక్కలను బోలియుండును గాని వీనికాళ్లు కుఱుచగా నుండును. ఇవి సాధారణముగా నెఱ్ఱరంగు కలవయి శరీరమునం దంతటను నిడుదరోమములు గలిగి జల్లితోఁక గలవిగా నుండును. దీనిని సహితమీదేశజనులు రేచకుక్క యందురు. ఇది యేనిజమయిన రేచకుక్క యని తోఁచుచున్నది. ఇది పగటిపూటమాత్రమే సంచారము చేయునది. అయినను రేచకుక్క రాత్రులయందు సహితము తిరుగఁ గలదు. ఇది తానుచంపిన జంతువులనుగాని స్వజాతిజంతువులు గుంపుకూడి చంపిన జంతువులనుగాని తిని జీవించును. మాంసాహారము దొరకనప్పుడిది శాకాహారమును సహితము తినునని చెప్పుదురు. ఈయడవికుక్కలాఱు మొదలుకొని పండ్రెండువఱకు కొన్ని సమయములయం దిరువదివఱకును గుంపుకూడి లేళ్లను, దుప్పులను, అడవిపందులను, అడవిగొఱ్ఱెలను వేటాడును. ఇవి సాధారణముగా మనుష్యుల వాసస్థానములకు సమీపమున నుండవు. అందుచేత గోవులు మొదలయిన పెంపుడు జంతువులకు వీనివలని భయమెప్పుడోకాని కలుగదు. ఇవి ఘూర్జరదేశమునందుఁ గొన్నిసంవత్సరములక్రిందట నొకపెంపుడు దున్నపోతు నీడ్చుకొనిపోయి చంపినవి. ఇవి పెద్దజంతువును పడగొట్టుచున్నప్పుడే కొన్ని ముందువైపునకడ్డముపోయి ముఖము మీఁదకాట్లువేయుచుండఁగా మఱికొన్ని వెనుకవైపుననుండి మీఁదఁబడి వాడి కోఱలతోఁ జీల్చివేయును.

ఇవి పెద్దపులులను వేటాడి చంపునని యీదేశమునం దంతటను వాడుక గలదు. ఇవి సాధారణముగాఁ బులులతోఁబోరాడుట సంభవింపదుగాని యుచితమైన మెదుపులేళ్ళు మొదలయినవాని నిమిత్తమయి పులులడ్డము వచ్చినప్పుడు వానినెదిరించి సంఘశక్తివలన నొకానొకప్పుడు చంపవచ్చును. ఇవి మూత్రవిసర్జనము చేసి దానిలో తమతోఁకను ముంచి శత్రుమృగముల నేత్రములలోఁ గొట్టి వానినంధములను జేయుననియు, ఇవి పెద్దపులులను జంపు విధమిట్టిదేయనియు, కొందఱు చెప్పుచున్నారు. ఇవి పెద్దజంతువులను సహితము చంపినను మనుష్యులను మాత్ర మెదిరించి చంపినట్లెక్కడను గానఁబడదు. వీనిని పెంచి మచ్చికపఱుచుట మిక్కిలి కష్టమయినను గొన్నిచోట్ల వీనిని పెంచుచున్నారు. ఇవి రెండుమాసములు గర్భముసుధరించి కొండగుహలలోను రంధ్రములలోను ఆఱేసిగాని యెక్కువగాని పిల్లలను పెట్టును.

జయద్రథనాటకము. (౩౨౨-పుట శేషము.)

అందఱు—సత్యము ౧ బహుయోగ్యముగా నున్నది.

జయం—అలాగున నేనైన యెడల నేను త్రాగియున్నానని మాత్రము తలచవద్దు.

[నిష్క్రమించును.]

మనో—అయ్యా! మనము కావలియుండుటకు బోదమురండు.

కల—అయ్యా! మీరీతనివరుస చూచితిరిగదా! ఈతడు బహుధైర్యవంతుడు. అర్జునుని ప్రక్క నిలువదగినవాడు. యుద్ధములో నెంత ధైర్యమున్న నేమి త్రాగుబోతుగుణ మీతని చెరుపుచున్నది. జయద్రథు డీసంగతి నెఱుఁగక యీతని గొప్ప గొప్పపనులలో నుంచుచున్నాడు. ఎప్పుడో త్రాగియుండి కొంపముంచక మానడు.

మనో—ఈతండు తరుచుగా నిట్లాచరించుచుండునా?

కల—ప్రతిదినమును నిద్రబోవుటకు బూర్వ మిదేపని. త్రాగకుండినేని రెండుదినములయిన నొక్కరీతి పనిచేయగలడు.

మనో—ఈసంగతి జయద్రథునితో జెప్పుట యుత్తమము. ఇప్పుడాత డీతనిసుగుణములనే చూచుచున్నాడుగాని దుర్గుణముల నెఱుంగడు. దొరకుంటిమేని యెప్పుడో యిబ్బంది సంభవించును— కానా!

[కామపాలుడు ప్రవేశించును.]

కల—(రహస్యముగా) కామపాలా! వెడలుము. జయంతుని వెంటాడింపుము—నడువు—

మనో—తనకు రెండవవానిగా నిట్టివాని నుంచుకొనుటవలన జయద్రథు డొకప్పుడు తప్పక కష్టములలో మునుగుననుటకు సందేహము లేదు. గనుక నీసంగతి ముఖ్యముగా నాయన కెఱిగించుట న్యాయము.

కల—నేనెప్పు డట్లుచెప్పను. జయంతుడు నాకు పరమస్నేహితుడు. అతని మరియొకవిధముగా బాగుచేసెదను.— ఆచప్పుడేమి! ఏమది?

తెరలో—(చచ్చుచున్నాను! చచ్చుచున్నాను!)

[కామపాలుని తరుముచు జయంతుడు ప్రవేశించును.]

జయం—ఓరి దొంగ, గాడిదా! దుర్మార్గుడా!

మనో—ఏమది? ఏమిసంగతి?

జయం—ఈనీచుడు నాకు బుద్ధిచెప్పగలడా! వీపు బద్దలుకొట్టెదను!

కామ—ఏదీ కొట్టు.

జయం—నోరుమూసికొమ్ము. తిరిగి మాటచెప్పెదవా?

[కామపాలుని కొట్టుచున్నాడు.]

మనో—అయ్యా! తాళుడు, తాళుడు. (జయంతుని త్రోయుచున్నాడు.)

జయం—నన్ను బోనీడు. లేనియెడల నెత్తిపై కొట్టెదను.

మనో—మీరు త్రాగియున్నారు. ఊరకొనుండి—(దెబ్బలాట.)

కల—(రహస్యముగా) కామపాలా! శీఘ్రముగాపోయి 'యుద్ధ'మని కేకలు పెట్టుము. ఊరందరిని లేపుము. (కామపాలుడు నిష్క్రమించును.)

జయంతా—అయ్యో! దుర్మార్గుడా! సహాయము. సహాయము!—సేనాధిపతి—అయ్యా! మనోరంజనా! అయ్యా! శాంతించుండి. జాగ్రతగా కాపుకాయుచున్నాము. (గంటవాగుచున్నది.) ఆగంటవాయించినదెవరు! దయ్యములవలె నున్నవి! జనులందరు లేచెదరు. భగవంతుని యిష్టము! ఇక మీపనిసరి.

[జయద్రథుడును సేవకులును ప్రవేశించుచున్నారు.]

జయ—ఏమా అల్లరి!

మనో—కర్మవశము, రక్తము కారిపోవుచున్నది. ప్రాణముండునని తోచదు. (నీరసపడుచున్నాడు)

జయద్ర—ఇంక చాలించుండి.

కల—ఊరకొనుండి! ఆగుండి! జయంతుడు—పెద్దమనుష్యులు! మీదేహములు మీరెరుంగరు. మనయజమానుడు మిమ్ము బిలుచుచున్నాడు. చాలించుండి. కలహము.

జయద్ర—ఏమి? ఈకలహమేల సంభవమయినది? మనమే తురుష్కులమై వారు మనను చేయదలచినది మనమే చేసికొనుచుంటిమా యేమి! సిగ్గు, సిగ్గు. ఈత్రాగుబోతుకలహములు మానుడు. ఈసారి కాలుకదల్చిన వానిని తప్పక మరణంబు నొందించెద. ఆభయంకరమగు ఘంటను మాన్పుడు! దానివలన జనులెల్ల లేచుచున్నారు. ఎందుకిది ప్రారంభమైనది? విచారసాగర నిమగ్నుండవగు కలహప్రియా! ఈకలహంబునకు గారణమేమి? నీవు నన్ను నిజముగా ప్రేమించెదవేని దీనినున్నది యున్నట్లు చెప్పుము?

కల—నాకేమియు తెలియదు. ఒక్కనిమిషముక్రిందట నూతనదంపతులకుండు నంతటి స్నేహముతో నందరు కాపుకాయుచుండిరి. ఇప్పుడే యేదో గ్రహచారము తప్పినట్లు కత్తులతో పోరాడదొడగిరి. ఇట్టి నీచకలహమునకు మొదలెట్టినదని చెప్పగలను? ఇట్టికలహములు చూచుటకు బ్రతుకుటకంటె నిదివరకేదైనను గొప్ప యుద్ధములో నీబొందినిబాయుటయే బాగుగనుండునుగదా!

జయద్ర—జయంతా! నిన్ను నీవు మరచితివా యేమి? ఈకలహమేల ప్రారంభమయ్యెను?

జయం—అయ్యా! నన్ను క్షమియింపుడు. ఇప్పుడేమియు మాటాడలేను.

జయద్ర—మనోరంజనా! చిన్నవాడవయ్యు శాంతిమంతుడవని పేరువహించి జనులందరిచే మంచివాడని పొగడబడుచుండు నీవును మర్యాదహీనమగు త్రాగుబోతు కలహములలో నేలచొచ్చితివి? దీనికి నాకుత్తరమిమ్ము.

మనో— అయ్యా! నాకు గాయములు మెండుగా తగిలినవి; మీసేవకుడగు కలహప్రియుడు సర్వము నెరిగింపగలడు. ఇతరులు మనప్రాణహాని తలపెట్టినపుడు వారితో నాత్మసంరక్షణకై పోరాడుట పాపము గానియెడల నావలన నించుకైనను నేరము లేదనిమాత్రము చెప్పగలను. ఇక మాటలాడుటకు నాకు శక్తిలేదు.

జయద్ర—దైవసాక్షిగా నాకు ఒడలుమంటలు పెట్టుచున్నది. నాశాంతతను కోపమును ముంచి పైయాడుచున్నది. ఇక నాచెయ్యి నించుక కదలించితినేని మీయందరిలోను బలమయినవాడు చావకపోడు. తత్క్షణ మీకలహకారణము నెరింగింపుడు. ఈకలహమునకు కారకుడు నాకెంతస్నేహితుడయినను వాడు నాదయకు పాత్రుడుగాడని మాత్రము నమ్మవలయును. ఎంతపని! యుద్ధభయములో మునింగి తేలుచున్న పట్టణములో ముఖ్యముగా పట్టణక్షేమ మరయవలసిన కావలియందు నిట్టిత్రాగుబోతు లుండెనా! ఛీ! సిగ్గుసిగ్గు—కలహప్రియా! దీని నెవరుప్రారంభించిరి?

మనో— జయంతునకును నీకునుగల స్నేహమువలన నేమయిన దాచితివేని నీవు ధైర్యవంతుడవు కావు—

కల—నన్నిట్లు నిర్బంధపెట్టకుడు. నేనీనాలుకతో జయంతున కపరాధ మొనర్చుటకంటె నీనాలుక నానోటినుండి తొలంగించుట కిచ్చింతును. అయిన నాకు నిజమని తోచినదానిని చెప్పెదను. చిత్తగింపుము. మనోరంజనుడు నేను నిచట మాటాడుచుండగా నెవడో యొకడు మాసహాయముగోరి పరుగెత్తివచ్చెను. జయంతు డాతని చంపనుద్దేశించి సిద్ధముగా నొరనుండితీయబడిన కత్తితో తరుముచువచ్చెను. అప్పు డీమనోరంజను డాతని కడ్డమువచ్చెను. నేనా రెండవవాని కేకవలన పురజనులు బెదురను భయముచే నాతని వెంటాడించితిని. ఆతండు నాకందకపారెను. నేను తిరిగి వచ్చునప్పటికి కత్తులచప్పుడు వినబడుచుండెను. జయంతునినోట బట్టరానితిట్లు తిట్టుచు నీతనితో పోరాడుచుండెను. ఆపోరాటము మీరవడచ్చితిరిగదా! నేనెరింగిన దింతియ. ఎంతటి మానవులకైన తప్పులు చేయుట స్వభావము. అయిన నాపారినవాడు జయంతునకేమియో గొప్పకీడు చేసియుండును. దానివలన నీతనికి పట్టరానికోపము వచ్చినది.

జయద్ర—కలహప్రియా! నీకు జయంతునిపైనున్న ప్రేమవలన నాతని తప్పుల మఱుగు పరిచితివనుటకు సందేహము లేదు. జయంతా! నిన్నిప్పుడీపనినుండితొలగించితిని.

[గుణవతి, సేవకులు ప్రవేశింతురు.]

చూడుము నాప్రాణేశ్వరికిగూడ నిద్రాభంగము జేసితివి.

గుణ— ఏమిది?

జయద్ర—ఏమియును లేదు; అంతయు బాగుగనేయున్నది: రానిద్రపోవుదము. మనోరంజనా! నీకౌషధము నేన యిచ్చెద. ఆతనిఁదీసికొనిపొండు. (మనో; తీసికొని పోవుచు) కలహప్రియా జాగ్రత్త; ఈకలహమువలన పట్టణములోకలిగినయలజడి శాంతిచేయుము— గుణవతీ రమ్ము.

రాచజన్మంబులకు జూడ రమణివిసువు
లెపుడు నిద్రలు చెడుచుండు నెంచిచూడ॥

[కలహప్రియుడును,జయంతుడును గాక తక్కినవారు నిష్క్రమించెదరు.]

కలహ—అయ్యా! మీకు గాయములు తగిలినవా?

జయం—బాగుగా తగిలినవి. ఇక వానికి మందు లేదు.

కలహ— అయ్యో పాపమా!

జయం— మర్యాద! పరువు! ప్రతిష్ఠ! నామర్యాదపోయినది. అయ్యో! అయ్యో! నాలో శాశ్వతపదార్థము నేటితో నశించినది. ఇక నేమృగతుల్యుడను. మర్యాద· కలహప్రియా! మర్యాద!

కల— ఇదా చెప్పవచ్చితివి! నేనింక నేదియో గాయము తగిలినది విచారించితిని. బుద్ధిమంతులగువారు తమశరీరమునకు తగిలిన గాయములకే విస్తారము లక్ష్యపెట్టుదురుగాని, మర్యాదకు తగిలినగాయమునకు లక్ష్యము చేయనే చేయరు. ఏలనన మర్యాద సాధారణముగా కారణము లేకయే చేకూరును. ఎట్లు చేకూరెనో అట్ల నాశంబు జెందును. నీమర్యాదకు లోపమువచ్చినదని నీవు దృఢముగా నమ్మకున్న యెడల నీమర్యాదకు లోపమే లేదు. ఏమయ్యా! ఇంతకెయింత చేయుచుంటివి. జయద్రథుని దయ తిరిగి నిమిషములో సంపాదించవచ్చును. నిన్నిట్లు పనినుండి తప్పించుటయు నాతండు కోపంబువలన చేయలేదు. సింహములను బెదరగొట్టుటకు కుక్కలనుకొట్టు వేటకాండ్రవలెనే పురజనుల కోపము మాన్పుటకు నిన్నిట్లు పనినుండి తప్పించెను. కాన నీవాతని శరణము జొచ్చితివేని మరల నీపని సంపాదించగలవు.

జయం— నేనాతని శరణుచొచ్చుటకంటె నన్ను నేను నిందించుకొనుచు కూరుచుం డుట మేలు. అంత మంచిప్రభువుతో నావంటి త్రాగుబోతు మూర్ఖశిరోమణి నేనని మాటాడబోదును. తప్పత్రాగి వారికి వచ్చినట్లు ప్రేలుటా! ఛీ. రూప రహితమును దుర్మార్గమును నగు మధురసప్రభావమా! నీకిదివరకే పేరును లేని యెడలను దయ్యమని పిలువనిమ్ము!

కల—మీరు తరుముకొనివచ్చిన యతడెవరు?

జయం—నేనెరుగను.

కల—నిజమేనా? అతడే మొనర్చెను?

జయం— నాకేమో లెక్కలేని మాటలు జ్ఞాపకమున్నవి. ఏదో కలహకారణము వచ్చినది. ఓ దేవుడా! మనుష్యులు తమగర్భశత్రువగు మధురసమును నవ్వుచు మ్రింగి దానిఫలములను ననుభవించుచున్నారు! అయ్యో! మనుష్యులు మృగ ప్రాయులౌచున్నారు!

కల—ఇప్పుడు మీమతి తిన్నగా నేయున్నదే. చిత్రముగా నున్నది.

జయం—ఆదయ్యమున కనుగ్రహమువచ్చినది. కోపోద్రేకమువల్ల మధురస దుర్గుణ ము లణచబడ్డవి.

కల— మీరు నీతి బాగుగా చెప్పగలరు. దేశస్థితి విచారించిచూడగా మీవలన తప్పేయున్నది. కార్యమునిగిలిన హేతువుచే మనమిప్పుడు గడచినదానికై విచా రింపక ముందుమాట చూచుకొనవలెను.

జయం—నాయుద్యోగము నాకిమ్మని యాతని నడిగెదను; ఒకవేళ నన్నాతడు త్రాగు బోతనునేమో! ఆమాట నాకు శేషునకున్నన్ని నోళ్ళుండిన నన్నింటిని మూయింప జాలనుగదా! ఇప్పుడు మనుష్యుడనుగానున్నాను. ఇంకనొక్కనిమిషమునకే పిచ్చి వాడనుగా నుందును. మరియొక నిముషమునకే పశుప్రాయుడ నగుదును! ఏమి వింత! మధురసమంత దుష్టవస్తువు మరియొకటి లేదుగదా! అయ్యో! దయ్యమా! యెంత చేసితివి!

కల—రండి, రండి. మంచిమధువు బహుయోగ్యమైన వస్తువు. ఇక దానిని మా త్రము తిట్టబోకుడు.

జయం—నీవు చెప్పినది సత్యము. త్రాగియుండుటా?

కల— నీవుమాత్రమే కాదు, బ్రతికియున్న యేమనుజుడైనను త్రాగవచ్చును. త్రాగి నందువలన తప్పలేదు. ఇప్పుడు నీవు చేయదగినపని చెప్పెదను వినుము. గుణవతి యిప్పుడు మనకు నిజమయినప్రభ్వి. గనుక నీవామెకడకుబోయి బ్రతిమాలు

కొమ్ము. ఆమెమాటకాలదనుగూడ దాటడు. ఆమె యుపకారము తలచినదానికంటెను అడిగినదానికంటెను ఎక్కువగా జేయుననుటకు సందేహములేదు.

జయం—నీవు చెప్పినది నిజమే.

కల—నేను నీకిచ్చినసలహా నిష్కాపట్య హృదయములో నిచ్చుచున్నాను.

జయం—రేపుదయముననే నామె యొద్దకు బోయెదను. నాకేపని కానియెడల నేనింక పనులకన్నింటికి నాశవిడిచెదను.

కల—మీరుచెప్పినది నిజము. మీకు శుభమగుగాక, నేను కాపునకేగవలెను.

జయం— సత్యవాక్యధురీణుడవైన కలహప్రియా! నీకు జయమగుగాక! నేను వచ్చెదను. [నిష్క్రమించుచున్నాడు.]

కల—ఇక నేనసత్యవాక్య ధురీణుడ ననువారెవరు? నేనీతని కిప్పుడిచ్చుచున్నసలహా న్యాయముగా నాలోచించినయెడల మంచిదియు జయద్రథుని యనుగ్రహము సంపాదించుటకు తగినయుపాయము ననుటకు సందేహములేదు. ఏలనన నాతండు గుణవతిమాట కడుగుదాటడు- ఆమె కిష్టమయినయెడల నాతం డెంత కార్యమైనను చేసితీరును. తన మతమునైనను విడుచును. ఇక నామెయు బహుయోగ్యురాలు. అడిగినదానిని లేదనుట యామెయెరుగదు. ఇట్టి యెడ నేనెట్టి కర్మార్గుడను! ఓదివ్యరూపముగల దుర్మార్గమా! ఓ నరకలోక వైకుంఠమా! రాక్షసులు మాయలవలన దివ్యరూపములు దాల్చినట్లు నేనిప్పు డీతని కొసగుచున్న యుపాయము లెంతదివ్యములుగానున్న నంతకంతకు దుఃఖదాయకములుగదా! ఏలనన నీ తెలివితక్కువ జయంతుడు నామాటలునమ్మి గుణవతిని ప్రార్థింప మొదలుపెట్టును. గుణవతియు జయద్రథునితో నాతనిపని యాతనికొసగుమని ప్రార్థించుచుండును, ఇట్లు ప్రార్థించుట జయంతునియం దామెకుగల కామవిషయకస్నేహమని చెప్పి జయద్రథుని మనసువిరిచి యామెపై కోతపుట్టించెదగాక! దీనివలన నామెసుగుణములే యామెకపాయము లొనరించును. ఈయుపాయమువలన నామె సద్గుణములువల చేసి వారినందరను పట్టగలను.

[కామపాలుడు ప్రవేశించును.]

ఏమి కామపాలా! రమ్ము.

కామ—నేనీయుద్ధంబులకు ప్రాలుమాలి రోసుచెందితిని. నాపని కుక్క సంతకేగినట్లాయెను. నాసొమ్మును చాలభాగము కర్చుపడ్డది. రాత్రిదిట్టముగా దెబ్బలు తింటిని. ఇక నాకష్టమునకు ప్రతిఫల మించుక ప్రపంచజ్ఞానము తప్ప వేరు గానుపించదు. గనుక శీఘ్రముగా కాశ్మీరమునకు బోవుటయే మేలని తలచెదను.

కల—ఉ॥ ఓరిమి జేయలేని నరు లున్నతకార్యము లూననేర్తురే?
కోరినయంత రోగములకున్ వడితగ్గవె యేరి కెయ్యెలన్
సారెకు మంత్రజాలముల సంగతిగోరక బుద్ధిచేత నిం
పార నొనర్చు కార్యమిది ప్రాజ్ఞుడ తొందరసేయనేటికిన్.

ముఖ్యముగా బుద్ధిచేత సాధించు కార్యములకు కాలమెక్కువపట్టును. మన యాలోచన యిదివరకు బాగుగనే సాగుచున్నది. జయంతుడు నిన్న కొట్టినంత మాత్రమున కాతనిపని యయిపోయినదిగదా! ఏది యెట్లున్నను ముందుపుష్పించిన చెట్లు ముందుఫలించవలెను. తృప్తిపొందియుండుము. తెల్లవారిపోయెనే. సంతోషమువలన రాత్రియంతయు నిమిషములోగడచిపోయెనే. ఇఁకలోనికేగెదను. వెనుక యోచింతము.

[కామపాలుడు నిష్క్రమించుచున్నాడు.]

ఇప్పుడు రెండుపనులు చేయవలెను. నాభార్య జయంతునివిషయమయి మాటాడుటకు గుణవతిపాలికేగవలెను. నేనుపోయి జయద్రథునేదియో నాకపనిమీద నవతలకు గొంపోయి జయంతుడు గుణవతితో మాటాడుసమయమున తోడ్కొని వచ్చి చూపవలెను. ఇదేయుపాయము. తెలివితక్కువగాని బద్ధకముగాని నా యాలోచనను పాడుచేయకుండుగాక!

[నిష్క్రమించును.]

జ య ద్ర థ నా ట క ము.

తృ తీ యాం క ము.

రంగము—కోటగుమ్మము.

[జయంతుడును పాఠకులును ప్రవేశించుచున్నారు.]

జయం—పాఠకులారా! ఇక్కడనిలిచి పాడుడు. మీకష్టము నేనుంచుకొనను. త్వరితముగా ముగింపుడు. (గానము.)

[విదూషకుడు ప్రవేశించును.]

విదూ— పాఠకులారా! మీకీడొబ్బరలకు బొబ్బిలి మారేడుకాయ ఉపయోగించినారా? యేమి. పాడుమువీల్చినముక్కుతో పాడుచున్నట్లు పాడుచున్నవి?

౧ పాఠ—ఏమి! నీకంటికానపకాయలు మారేడుకాయలలాగున నున్నవా? ఏమి?

విదూ—ఆ! అదేచిత్రము. నాకంటికానపకాయలు మారేళ్ళగును. కాసులు గవ్వలగును. ఇదిగో మీకుతగినకూలి. ఇది మీరీశ్వనిమానుటకే మీకియ్యబడుచున్నది. మనప్రభువు మిమ్ముల నీపిచ్చిగాన మీపాటి చాలించుమని చెప్పుచున్నారు.

౧. పాఠ—మేమింతట మానము.

విదూ— అయితే ఇతరులకెవ్వరికేని వినుపించనిపాట మీకుచేతనైనయెడల దానిని పాడుడు.

౧. పాఠ—అట్టిది మాయొద్ద లేదు.

విదూ— ఈపాటి వీణలను గవిసెనలలో చూర్చు. మేమీపాటి సభ చాలించెదము. తిరిగి కనబడకుండ పొండు. గాలిలోకలసిపొండు.

[పాఠకుడు నిష్క్రమించుచున్నాడు.]

జయం—మిత్రమా! నాచెప్పుమాటల నించుకవినియెదవే?

విదూ—నీచెప్పు మాటలాడగలిగినను నేవినను. నీమాటలనే వినియెదను.

జయం— నీహాస్యమును కొంచెముసేపు చాలింపుము. అదిగో నీకు బహుమానము. మన యజమానురాలిగారి దాసి యటగలదేని నేనిచ్చట వేచియున్నానని లోనికి వర్తమానము పంపుము; ఈసహాయమొనర్చెదవే?

విదూ— ముఖ్యముగా. ప్రభువుచిత్తమునకుదిరినయెడల నామె మాసన్నిధి కేతెంచినయెడల. అప్పుడు చూచెదము.

జయ—సరే. త్వరితముగా మాత్రము చెప్పుము. [నిశేషము.]

సంఘదురాచార సంస్కరణ సమాజమును దానియుద్దేశమును.

(౩౧౮-పుట శేషము.)

ఒండొరుల సౌఖ్యమునకొఱకును వృద్ధికొఱకును స్త్రీపురుషులను భగవంతుఁడు సృజియించినాఁడు గాని పాపకర్ములగుటచే స్త్రీలుగను పుణ్యాత్ములగుటచే పురుషులుగను సృజియించలేదు. భగవంతుని యుద్దేశ మదియెంతమాత్రమును కానట్టు కొంచెమాలోచించినవారికెల్లరకును దెలియును. భగవంతుని ప్రేమింపనుద్దేశించినచో న్యాయమునే కోరి అన్యాయమునకు చోటియ్యక దేశక్షేమమునకయి పాటుపడి న్యాయమునే యవలంబించి పనిచేయవలయును. న్యాయానుష్ఠానమునందు ధైర్యము గలిగి, భగవంతుని ప్రేమించుటయే ముఖ్యాంశముగా నెంచి పరోపకారబుద్ధితో నందఱును పాటుపడవలయునని పైననే చెప్పియున్నాను. మౌఢ్యవశముచే నజ్ఞానులు దుష్కార్యముల నాచరించినచో వారు చేయునవి దుష్కార్యములని తెలిసినవారు అట్టివారిని మరలించుటకు ప్రయత్నించవలయును.

ఈ విషయము ఇదివరకనేకులచే నుపన్యాసము లీయఁబడినదే కాని నూతనమయినది కాదు. పండిత ఈశ్వరచంద్ర విద్యాసాగరులవారు తమ యావజ్జీవమును పాటుపడి స్త్రీపునర్వివాహములు శాస్త్రసమ్మతములని యనేకలక్ష్యముల నగుపఱచి ఆంశమును గురించి యనేకులతో చర్చించి సిద్ధాంతపరచిరి. ఎందఱెంత పాటుపడి పనిచేసినను ఎన్నిలక్ష్యములను శాస్త్రములనుండి వెదకి కనుపరచఁగలిగినను, హిందూ వితంతువుల దుర్దశను జూచి జాలినొంది వారి దుర్గతిఁ బాపవలయునని కొందఱికెంత దృఢమయిన కోరికయున్నను సాహసించి స్త్రీపునర్వివాహము లాచరించువారును, అట్టివివాహములను చేయించినవారి నాదరించి వారికి సహాయము చేయువారును లేకపోయిరి. బాలవితంతువుల దుర్దశఁ జూచినవారికెంత కఠినహృదయులైనను మనసు కరఁగకపోదని నే నెంచఁజాలను. స్త్రీపునర్వివాహము లావశ్యకములని మాటలను మాత్రము చెప్పి కార్యమాసన్నమయినప్పుడొక్కరును గానుపించక పరోపకారబుద్ధితోఁ బాటుపడి యెన్నికష్టములకయిన నోర్చి పనిచేయువారొకరిద్దరు సాహసబుద్ధితో పనిచేసినచో వారిని బహిష్కారము చేయించుటకును వారి ప్రయత్నములు వ్యర్థప్రయత్నములని వారి నాక్షేపించుటకును మాత్రము కానుపింతురు.

వయస్సుమీరియు, సంతానముండియు పురుషులుమాత్రమే వివాహమాడి సుఖించుటయు స్త్రీలతిబాల్యదశయందు వైధవ్యమును పొందినను తిరిగి వివాహమాడి సుఖింపనేరక తమజీవితకాలమునంతయు నతికష్టతరముగా వెళ్ళఁబుచ్చుటయు నిష్పాక్షికబుద్ధితో యోచించువారి కందఱికి యుక్తముగాఁదోచునని నేనూహింపఁజాలను. కామసౌఖ్యము పురుషులెట్లు కోరుదురో స్త్రీలును అట్లే కోరుచుందురు. పురుషులకంటె కామము స్త్రీలకెక్కువయని మనశాస్త్రములే చెప్పుచున్నవి. స్త్రీలకతిబాల్య

దశయందు వైధవ్యము సంప్రాప్తమైనచో జీవితకాలమంతయుఁ గామసుఖము పేక్షిం
పక వారెట్లుగడపఁగలుగుదురు? వయస్సుమీరుటచే నింద్రియసుఖవిముఖులుగా జేయఁ
బడిన పురుషులే కామజన్యవికారమునకు లోబడి మరల వివాహమాడుచుండఁగా
బాల్యావస్థయందు వితంతువులుగాఁ జేయఁబడిన స్త్రీలు మాత్రమే కామవికారము
నకు లోఁబడక యింద్రియసౌఖ్యములను కోరకుండఁ గలుగుదురా? పశుపక్ష్యాది
జంతువులకుఁగూడ సహజమగు కామము స్త్రీలుమాత్రమెట్లాపు కొననేర్తురు?
లోకానుభవమించుకైనను లేని యతిబాల్యదశయందీదుర్దశ ప్రాప్తమయి వైధవ్యమన్న
నేమియోయెఱుఁగక తోడిబాలికలతో నాటపాటల నేగుచు వారివలన మాటిమాటికి
"ముండా, ముండా" యని పిలువఁబడి తల్లిదండ్రులనుజూచి 'నాయనా! నన్ను ముండ
యనుచున్నారేమి? అమ్మా! నన్ను ఆటలకు రానియ్యరేమి? వారితో నన్ను చేరనియ్య
కున్నారేమి?' అనియడిగి తనకు సంభవించిన దుర్దశ నించుకయిన గుర్తెఱుఁగని చిన్ని
బాలికలఁజూచిన నయినఁ దల్లిదండ్రులకు హృదయము కరుగకున్నది. తమయిల్లుఁ దమ
మృతినొందెననుమాటవిని యెద్దపెట్టున రోదనము చేయుచు రొమ్ములు బాదుకొని
తమబాలికనుజూచి 'అమ్మా! నీకెంతదుర్దశ సంభవించెనే' యని విచారించుచుండెడి
తనతల్లిదండ్రులనుజూచి వెలవెలబోయి తనదుర్దశనుగూర్చి యేడ్చుచున్నారను
జ్ఞానమించుకైనను లేక వారేడ్చుచున్నారని తానునేడ్చుచు 'అమ్మా! యేడ్చు
చున్నావేమి? నాయనా? విచారించుచున్నావేమి?' యనిముద్దుమాటలతో నడుగు
బాలికలఁజూచినతరువాతనుగూడ మనసు కరుగకున్నది. తనకదివఱకు వివాహమైన
సంగతినే యెఱుఁగక యిరుగుపొరుగువారి పిల్లలకు వివాహములగుచుండుటఁ జూచి
'అమ్మా!' నాకెప్పుడు పెండ్లి చేసెదరు? నాయనా! నన్నెప్పుడు పల్లకిలో నూరేగింతు
రని గారాబముతో నడుగు నిరపరాధినులగు చిన్నిబాలికల నిట్టిఘోరవైధవ్య
వ్రతము పాలుసేయ చేతులెట్లువచ్చును? తనతోడి బాలికలు పేరంటకమున కేగు
చుండఁగాఁ దానును పేరంటకమున కాయత్తమై తల్లిచేనివారింపఁబడి యేడ్చుచు
తనకు సంభవించిన దుర్దశమూలమున నితరులయిండ్లకుఁ బోఁగూడదను జ్ఞానములేక
తల్లికొంగుబట్టిలాగుచు తన్నుఁగూడ దీసికొనిపొమ్మనుచున్నప్పుడు కనిపెంచిన తల్లి
యెట్లు సహించుచున్నదో తెలియకున్నది. తనతోడి బాలికలు అలంకరించుకొని
పసుపుకుంకుమలకుఁ బోవుచుండుటయు దానిమాత్రమే మూలఁగూర్చుండి యెదుటఁ
బడినమాత్రముననే యరిష్టసూచకమని తిట్లుతినుచు శుభకార్యములయందందఱును
సంతోషముతో నుండఁగాఁ దాను ముసుఁగు పెట్టుకొని వ్యసనపడుచుండుటయు
బాలవితంతువులకెట్లు సంతాపకారణములు కాకుండును! శుభకార్యములయం

యెదుటఁబడుటకయిన నర్హతగాక మూలఁగూర్చుండియుండునట్లుండఁగా చూచిన వారుగూడ చెవులుమూసికొని పాపినిచూచినట్లు చూచుచు తమయెదుటఁ బడినందులకు నిందించుచునుందురు. తనతోడి బాలికలు సుఖముగా భర్తలతో కాపురము చేయుచుఁ బిల్లలనుగని పెంచుటయు తానుమాత్రమే కుడుచుటకు కడుపునిండ నన్నమైనను కట్టుకొనుట కొకమంచిబట్టయయినను లేక కురూపిణిగాఁ జేయఁబడి అతి హీనముగా తనయాత్రజరుపుచుండుటయు బాలవితంతువులకెట్లు దుఃఖము హెచ్చింప కుండును?

పుట్టిననాటనుండియుఁ బ్రేమానురాగములతో నెత్తిపెంచి ప్రాణసమానముగాఁ దలఁచి యతిగారాబముతో జూచుకొనిన తమముద్దుబాలికలిట్టి ఘోరమగు వ్రతమునకులోనయికష్టపడుచుండఁదల్లిదండ్రులెట్లుచూడఁగలుగుచున్నారో నేనూహింపఁ జాలకున్నాను. చిన్ననాటనుండియు తమచేతులతో దువ్విమెఱుఁగిడి పెంచినట్టియు తామువెట్టని యలంకారమగునట్టియు శిరోజములను తమయెదుటనే తీయించి కురూపురాండ్రనుగాఁ జేయఁదల్లిదండ్రులకెట్లు మనసొప్పుచున్నది? పెనిమిటి మృతి నొందెనన్న మాత్రముచేతనే సర్వాలంకారములను దీయించి తలగొరిగించి కడుపు నిండ నన్నమునైనను బెట్టక కట్టుకొనుట కొకమంచిబట్టనైననియ్యక యేమయిన నడిగినచో కోపపడుచువచ్చియుఁ జావకుండఁజేసి యతినీచముగాఁ దమబాలికను జూచుచున్నారు. వితంతువులకు శిరోజములుదీయించు దుష్టాచారమెట్లుకలిగెనో తెలియకున్నది. విధవలు ఆచరించఁదగినవని కపిలస్మృతియందుఁ జెప్పఁబడిన యతికష్టతరములగు ధర్మములయందుఁగూడ కేశములను మొదలంటతీయించి తలగొరిగించుకొనవలెనని చెప్పఁబడియుండలేదు. మఱియు పరాశరస్మృతియందు:—

శ్లో॥ నస్త్రియాః కేశవపనం నదూరేశయనాశనమ్।
నచగోష్ఠే వసేద్రాత్రౌ నదివాగా అనువ్రజేత్।
నదీషుసంగమేచైవ అరణ్యేషు విశేషతః।
నస్త్రీణా మజినంవాసో వ్రతమేవసమాచరేత్॥

స్త్రీలకు మొదలంటు క్షౌరమును, దూరముగనావులున్నచోటఁ గూర్చుండుటయు, నావులదొడ్డియందు రాత్రినివసించుటయు, పగలుగోవులవెంబడి చనుటయు, నదులు సముద్రమునఁగలియు చోటులయందును అడవులయందును నివసించుటయు, చర్మములు ధరించుటయుఁగూడదు. తక్కినవ్రతమునే చేయఁదగును అని చెప్పఁబడి యున్నది. కొందఱీవాక్యము సువాసినులకును కన్యలకును మాత్రమే వర్తించునని చెప్పుదురు. అట్టివారినిగురించి వేరెచెప్పఁబడియుండుటచేతను స్త్రీలనిసామాన్య

ముగా జెప్పఁబడియుండుటచేతను విధవలకుఁగూడ వర్తించునని నాతాత్పర్యము. భర్తపోయినమాత్రముననే పలువురుచేరి బలాత్కారముగా కేశములనుతీయించు దురాచారము మిక్కిలిక్రూరముగానున్నది. వారిసమాధానము నొందక బాలవితంతువులకుబలాత్కారముగా కేశములను మొదలంట తీయించు దురాచారము నశింపవలయును. భార్యలను పోఁగొట్టుకొనిన పురుషులను కురూపులనుగాఁజేసి కలకాలము మరలవివాహమాడకుండవలయునన్నచో వారికెంతకష్టతరముగానుండునో యోచింపుఁడు. ఆడుపుట్టుకపుట్టి మగనినిపోఁగొట్టుకొనిన మాత్రమున కలకాల మిట్టిదుర్దశలపాలఁబడి బాధలఁబెట్టఁబడుటకంటె నొక్కసారిగాగొంతుకకోసి చంపఁబడుట వారికెంత సుఖకరముగానుండును. ఇట్టివీరిబాధలు తగ్గించుటకే పరపీడనమోర్వఁజాలని మహానీయులెవ్వరో పూర్వము విధవలు సహగమనముచేయవలయునని నియమించిరనియు అట్టిసహగమనము మాన్పించుట వారికొకయుపకారమే అయినను బాలవితంతువులకుమాత్ర ముపకారమే అయినదనియు నేనుభావించెదను.

బాలవితంతువులకు వివాహములుచేయకుండుటచేతనే వ్యభిచారమును శిశుహత్యలును హెచ్చుచున్నవి. స్త్రీలకు పురుషులకంటె కామమెక్కువయని పైనేచెప్పియున్నాను. కామబాధకోర్వఁజాలక యెప్పుడో యేరాత్రివేళనో తమయింటనుండి వెడలి జారభర్తలతోఁగూడి తమయెరుకనే కాపురముండి జారిణియయి కాలమువెళ్ళఁబుచ్చుట తల్లిదండ్రులకవమానముకాక తామేయోగ్యుని విచారించి తమకూతునకుమరలవివాహము చేయుట మాత్రముసహింపరానికృత్యముగానున్నదా? ఏనీచజాతియుపభర్తతోడనో నూతి సంచరించుచు వానివలన మోసపోయి తమయొద్దనున్న ధనమునంతయు వానికే దోచిపెట్టి శరీరము పాడుచేసికొని శిశుహత్యాది మహాపాతకములకు లోనయి రక్షకభటులచే పట్టువడి వెల్లడియయి యూరూరఁ దెలిసి జనసామాన్యముచే నతిహీనముగాఁజూడఁబడి తమకు తలవంపులు గలుగఁజేసి తమపిల్లలు కాలముగడపుట తల్లిదండ్రులకు గౌరవలోపముగాకుండ స్వజాతివానికి తమపిల్లనిచ్చి తమ చేతులతోమరలవివాహముచేసి వారిని సుఖింపఁజేయుటమాత్రము వారికిగౌరవలోపముగానున్నదా? బాలవితంతువులింటనుండిచేయు దుష్కార్యములకంటె తిరిగి వివాహమాడఁగలుగుటయే సర్వోత్కృష్టముగానుండును. కామము పట్టఁజాలక సంచరించి గర్భిణియయి అందరికిని తెలిసినచో నవమానకరమని తమకు పుట్టిన నోరెరుగని చిన్నిశిశువులనుగొంతుకనులిమి యేయేటిదరినో నిర్జనముగానుండు ప్రదేశమునఁ బడవేయుటయు నాశిశువుల ముద్దుమొగములు కాకులును గ్రద్దలును పొడుచుకొనితినుటయు నంతయుమెఱిఁగియున్న యంశమేకదా? అట్టిశిశువులఁజూచిననయిన కనికరమేలపుట్టదు? [సశేషము.]

సూర్యశతకము. (౩౩౦-పుట శేషము.)

స్ర॥ భిన్నం భాసారుణస్య క్వచిదభినవయా విద్రుమాణాం త్విషేవ।
త్వంగన్నక్షత్రరత్న ద్యుతినికరకరా ళాంతరాళం క్వచిచ్చ।
నాంతశ్శ్లిష్టేషకృష్ణ శ్రియముదధిమివ ధ్వాంతరాశిం పిబన్ స్తా।
దౌర్వః పూర్వోప్యపూర్వో గ్నిరివభవదఘ ప్లుష్టయేర్వా వభాసః॥ ౩౫॥

మ॥ అరుణచ్ఛిన్నవ విద్రుమాభ, యొకచో, నంచద్భముక్తాఫలో।
దరనిర్యద్ద్యుతులొక్కచోటఁ బెరయ, న్నాశేష కృష్ణశ్రీ, శా।
ర్వరసంఘంబు, మహాబ్ధియట్లానర, నౌర్వంబట్లపూర్వంబు పూ॥
ర్వరవిద్యోతము ద్రావు నేఁడి, యదిమీపాపమ్ములం దున్మెడున్॥ ౩౫॥

స్ర॥ గంధర్వైర్గద్య పద్యవ్యతి కలితవచో హృద్యమాతోద్యవాద్యై।
రాద్యైర్నారదాద్యైర్మునిభిర భినుతో వేదవేద్యైర్విభిద్య।
ఆసాద్యాపద్యతేయం పునరపిచ జగద్యౌవనం సద్య ఉద్య।
న్నుద్ద్యోతో ద్యోతిత ద్యౌర్ద్యతు దివసకృతో సావవద్యాని వోద్య॥ ౩౬॥

శా॥ గానానూనత గద్యపద్యములఁ గాంతుల్దీరఁ గంధర్వులున్ ।
నానావేద్యములన్నిరంతము శ్రుతులన్వ్యాసాదిమౌనీంద్రులున్।
భానంబద్దిది గాంచి ముజ్జగము సంపాదించెడు న్యౌవనం।
బానందంబది మీకుఁ జేయు లసితానంతంబ ఘౌఘాంతమున్॥ ౩౬॥

స్ర॥ ఆవానైశ్చంద్రకాంతై శ్చ్యుతతి మిరతయా తానవాత్తారకాణా।
మేణాంకాలోకలోపాదుపహతతమసా మోషధీనాం లయేన॥
ఆరాదుత్ప్రేక్ష్యమాణా క్షణముదయతటాంతర్హిత స్యాహిమాంశో
రాభా ప్రాభాతికీవో వతునతునితరాంతావదావి ర్భవంతీ॥ ౩౭॥

---

౩౫. అరుణ......భ= అనూరుని కాంతియును క్రొంబగడముల కాంతి. అంచ ...ద్యుతులు=మెఱయుచుక్కలను ముత్తెములలో పలినుండి వెడలు వెలుఁగులు. పెరయన్=కలియఁగా. నాశేషకృష్ణశ్రీ...చీఁకటి, లోపల ననూరుని కెంపును చుక్కల తెలుపును గలదిగాన, సముద్రము, పవడములు ముత్తెములు తోనుండుటచేత నేగాక, శేషుఁడు, విష్ణువును, లక్ష్మియుఁగలదిగావుటం బట్టియు నట్టిది. శార్వర=చీఁకటి. ఔర్వ=బడబానలము.

౩౬. గానానూనతన్= పాటయందాధిక్యముచేత. శ్రుతులన్, నానావేద్యములన్=వేదములచే ననేకవిషయములచేత, భానంబు=వెలుఁగు. లసి...తంబు=ప్రకాశింపజేయఁబడిన యాకసముగల. ౩౭. కల్యే...లము= వేకువనించుక మెఱయు. విరిదమంబు=నశించుచీఁకటి. విభూతులు=ఐశ్వర్యములు.

మ॥ జలబాష్పం బుదయాద్రిచాటున నిమేషంబుండఁ గన్యోప దు।
జ్జ్వలతా చిల్లెది యామ్యతా దవుల చే జాలింకుచంద్రోపలం।
బులుఁ జిల్పంబడు చుక్కలున్విరిదమంబు న్మాయుశీతాంశుఁ గాం
తుఁడు పోనాడెను సోమధుల్లన విభూతుల్మీక చెప్పెద్దుక్॥ ౩౭॥

స్ర॥ సానౌ సాహౌదయేనా రుణితదళపునర్యావనానాం వనానాం।
మాలీమాలీభపూర్వా పరిహృతకుహకో హాంతనిమ్నాతనిమ్నా।
భావో భావోపశాంతిం దిశతుదినపతే ర్భాసమానాసమానా।
రాజీరాజీవరేణో స్సమశమయమదే తీవయస్యావయస్యా॥ ౩౮॥

చం॥ వనజపరాగరాజి, సఖిసైఖరి, నూతనరాగపత్త్రయా।
వనవనరాజితోదయము వర్జ్యదరోదర పార్శ్వభాగముల్।
దనుత నుతం, బసామ్యలసితంబు సమానసముద్గతంబు నే।
దినపతిదీప్తి కర్ణినుడిఁ దేలుచు శాంతిని శాంతచింతనల్॥ ౩౮॥

స్ర॥ ఉజ్జృంభాంభోరుహాణాం ప్రభవతి పయసాం యాశ్రయైనోష్ణతాయై
పుష్ణాత్యాలోకమాత్రం నతుదిశతిదృశాం దృశ్యమానా విభూతం।
పూర్వాద్రేరేవపూర్వం దివమనుచతుర్భః పావనీదిబ్మభానా।
మేనాంస్యైనీ విభాసానుదతునుతి పద్రైకా స్పదం ప్రాక్తనీవః॥ ౩౯॥

చం॥ స్ఫటికమలంబులౌ కమలముల్సిరిఁ బెంచును బెంచపుష్ణముల్।
బటిమ మెచూడఁ జాడ్యులకుఁ జాటిలేదు న్నిఅమిట్లుగల్గవు।
త్కటపరిశుద్ధిమంను దయభాత్రినై మైనటునింగి దిక్కులం।
తటనగు దేనఁ బ్రాగినుని ధామమదే భళి పాపలోపియా॥ ౩౯॥

స్ర॥ వాచాంవాచస్పతేరప్యచలభి దుదితా చార్యకాణాం ప్రపంచై।
ర్వైరించానాం తథోచ్చారితరుచి మదృచాం చానినానాం చతుర్ణామ్।

౩౮. నూతన...దయము=సూర్యకాంతి. క్రొత్తయెఱుపుగల ఆకులచేఁబరువము గల యడవులచేఁ బ్రకాశింపఁ జేయఁబడిన యుదయపర్వతముగలది. తామరపూదుమ్ము చాల్పుపడునున, పత్త్ర=రేకులు. వన=తామరకొలఁకులు. శేషము సమము. తనుతనుతంబు= సూక్ష్మత చేస్తుతింపబడినది. (కావున) వర్జ్య...గముల్=విడునఁదగినగోతుల లోతుప్రక్కలుగలది. పూదుమ్ము, పద్మగర్భములో బ్రుక్కలనంటునిది. సమానసముద్గతంబు= ఒకప్పుడుపొడమినది. ౩౯. స్ఫట...లముల్=విరిదమ్ములుగఁ నీళ్ళు.

ఉచ్చైస్తారాప్రసువాచ్యచ్యుతి శుచిచరితం యస్య నో ద్వైర్వివిచ్య।
ప్రాచ్యం వర్చః ప్రకాశప్రసర ముపచినుతాత్తస్య చండార్చిషో వః॥ ౪౦॥

మ॥ అచలద్విడ్గురుశాస్త్రగీష్పతివచో వ్యాసంబున స్థాత్ప వే।
దచయోచ్చారణ శుద్ధవక్త్రముల నాద్ధత్యంబునన్ ద్వేయ।
చ్చచరిత్రంబు వివేకముర్వచము పూజావేళ నిర్వాచ్యము।
చ్చచకాసద్ర విధామ, మామయభిదా సౌఖ్యంబు మీకిచ్చెడున్॥ ౪౦॥

స్ర॥ మూర్ధన్యద్రేర్ధాతు రాగస్తరుషు కిసలయో విద్రుమౌఘస్సముద్రే।
దిఙ్మాతంగోత్తమాంగేష్వభినవ నిహితసాంద్ర సిందూర రేణుః।
సీమ్ని వ్యోమ్నశ్చ హేమ్నస్సుర శిఖరి భువో జాయతే యః ప్రకాశః।
శోణిమ్నా సౌ ఖరాంశో రుష సివిశతు వశ్శర్మ శోభైకదేశః॥ ౪౧॥

మ॥ జలధిన్విద్రుమముల్ ద్రుమాళిఁ జివురుల్ శైలంబునం జేళ్రుమల్।
బలభిత్కుంభిశిరంబునం దరళ ప్రత్యగ్ర సిందూరమా।
ళులు బింటన్హారు బింటిపైడి తళుకుల్ శోణద్యుతి ద్భాను దీ।
ప్తిలవంబుల్ వఱువాత నేఁడి భవత్ప్రీత్యావహంబయ్యెడున్॥ ౪౧॥

స్ర॥ అస్తాద్రీశోత్తమాంగే శ్రితశశిని తమః కాలకూటే నిపీతే।
యాతే వ్యక్తిం పురస్తాదరుణకిసలయే ప్రత్యుషః పారిజాతే।
ఉద్యత్యారక్తపీతాంబర విశదతరో ద్వీక్షితా తీక్ష్ణభానో।
ర్లక్ష్మీర్లక్ష్మీరివాస్తు స్ఫటికమల పుటోపాశ్రయా శ్రేయసే వః॥ ౪౨॥

శా॥ అందం బంచును దస్తశూలితల యుర్లన్ కాలకూటంబు వోన్।
బొందన్సారుణ పల్లవంబుదయమున్ ముగ్ధ్యమందారమై।
ద్యుందమ్ముల్దరఫుల్లము ల్వెలవుగా నారక్తపీతాంబరా।
మందోద్వీక్షిత యాచుదోచు సిరి సేమమ్మార్కి మీకిచ్చెడున్॥ ౪౨॥

---

౪౦. వ్యాస=విస్తారము. వివేకముర్వచము= వేరుపాటుచేఁ బలుకశక్యము కానిది. నిర్వాచ్యము=నిర్దోషము. ఉచ్చ చ...ధామము= గొప్పదియై వెలుగు సూర్యకాంతి. ఆమయభిదా. ఆరోగ్యము. ౪౧. హరువిల్లు=ఆకాశము.

౪౨. అస్తశూలి=అస్తాచలమను శివుడు. సారుణపల్లవంబు=అనూరుఁడను చెట్టిని చిగుళ్ళుగల. కల్య=వేకువ. దరఫుల్ల=ఇంచుక వికసించిన. అర...క్షిత= ఇంచుక యెఱ్ఱనిదియుఁ బచ్చనిదియునగు నాకాశమున మెలఁకువగల వారిచేఁ జూడఁబడినది, మిక్కిలి వలపుగలవెన్నునిచే నధికముగఁ గనుగొనఁబడినది. సిరి=కాంతియను లక్ష్మి. ఆర్కి=సూర్యునిది.

స్ర॥ సోదర్యాస్సన్తు భూమిర్న తను జరభువో బాంధవాః కౌస్తుభాద్యాః।
పాణౌ పద్మం న యస్యా నచ నరకరిపూరస్సలీ వాసవేశ్మ।
తేజోరూపాపరైన త్రిషు భువనతలేష్వాదధానా వ్యవస్థాం।
సా శ్రీః శ్రేయాంసి దిశ్యాద శిశిరమహసో మండలాగ్రోద్గతా వః॥ ౮౩॥
మ॥ కడలిం బుట్టమి గౌస్తుభాదులనుఁ గూర్గారచ్యుతోరస్థలిన్।
విడిదిం జెందమి గేలవారిరుహముల్ లేద స్వయంతేజరూ।
పడర న్ముజ్జగమందు సత్క్రియల మర్యాదం బ్రతిష్ఠింప నే।
విడఁ బుట్టె న్రవిమండలాగ్రమున నా పెన్నచ్చి యిచ్చు న్సిరుల్॥ ౮౩॥

ఇతి ప్రభావర్ణనమ్.

అశ్వవర్ణనమ్.

స్ర॥ రక్షంత్వక్షుణ్ణహేమోపలపటలమలం లాఘవాదుత్పతంతః।
పాతంగాః పంగ్వవజ్ఞాజిత పవనజవా వాజినస్తే జగంతి।
యేషాం వీతాన్యదహ్నా శ్నయమపి వహతాం మార్గమాఖ్యాతి మేరౌ।
ఉద్యన్నుద్దామ దీప్తిద్యుమణి మణిశిలావేది కాజాతవేదాః॥ ౮౪॥
మ॥ తలఁటంబిచ్చుక కుంటు గాలివడి డిందంజంగున న్దాటుచుం।
బలవత్సూరుని వారువంబులివి సౌవర్ణంపు రాల్నల్గ వే।
గుఱుతుల్గాన్పడ వాండుతైన దివిషద్గోత్రంబున న్వేనితె।
న్నెఱిఁగించు న్రవికాంతవేదిహుతభుగ్జ్వాలల్గ తుల్కాకవా॥ ౮౪॥
స్ర॥ ప్లుష్టాః పృష్ఠేంశుపాతైరతి నికటతయా దత్త దాహాతిరేకైః।
రేకాహాక్రాంత కృత్స్న త్రిదివ పథపృథుశ్వాసశోషాః క్రమేణ।
తీవ్రోదన్యాస్త్వరంతామహిత విహతయే సప్తయుస్సప్తసప్తే।
రభ్యాశాకాశ గంగాజల సరళగళావాక్కృతా గ్రానవావః॥ ౮౫॥
మ॥ తమ వెన్నుల్గదుఁ జేరువాట ఘృణిపాతమ్ముల్పదంగాల్ప స।
ర్వమరున్మార్గము దాటుటాక పగటన్యాసంబి గుర్గూర్ప దా।
హము మెండై దరిచేల్పు చోట మెడలొయ్య న్నాచి వాంచుందలల్।
గమలాప్తాశ్వము లేవ వాపదల వేగంబాపు భావత్కముల్॥ ౮౫॥ [సశేషము.]

---

౮౩. మండలాగ్ర = బింబము నెమట, కత్తియందు. పెన్నచ్చి = పెద్దవెలుఁగను మహాలక్ష్మి. ౮౪. తలటక = చబుకుతోఁగొట్టఁగా, డిఁదక = తగ్గగా, దివిషద్గోత్ర = మేరువు తెన్ను = దారి, రవి.. హేతులు = సూర్యకాంతములను నరుఁగునందలియగ్గి మంటలు. ౮౫. ఘృణిపాత = కిరణప్రసార, సర్వమరున్మార్గము = ఆకాశమంత, భావత్కములు = మీవి.

స్త్రీహితోపదేశము. (౩౭౬- పుట శేషము.)

శ్వేతస్రావము:— ఈబాధ గర్భిణిస్త్రీలకు నెలలునిండు సమయములో కలుగును. అతివరకు చాలమంది సంతానముగలవారికి విశేష శ్రమకరముగానుండును. ఇది గర్భముయొక్క భారము క్రింది భాగము మీద మోసి ఒరుపు కలుగజేయుటచేత కలుగును. ఇందుకు ప్రతిక్రియ—ప్రతిదినమును చాలసేపు పరుండియుండవలెను. పక్కమీద బట్టలు ఒత్తుగా వేసికొనక, మంచిగాలివచ్చు గదిలో పరుండవలెను. లఘ్వాహారము పుచ్చుకొనుచు కాలప్రవృత్తి అనుకూలముగా అగులాగున జాగ్రత పుచ్చుకొనుచుండవలెను. ఈబాధకలిగినప్పుడు శుభ్రత విశేషముగానుండవలెను. ఇందుకొకపని ముఖ్యముగా చేయవలెను. ఏమనగా, ఒక నీళ్ళతొట్టిచేయించుకొని దానినిండ శుభ్రమయిన చన్నీళ్ళతో డించుకొని వస్త్రవిసర్జనచేసికొని కావలసిన యెడల పైనిమాత్ర మేదైనను కప్పుకొని ఆతొట్టిలో ప్రతిదినము ఉదయమున ఒకటిరెండు నిముషములు కూరుచుండి పిమ్మట లేచి తుడుచుకొనుచుండవలెను. ఇందువల్ల పైనిచెప్పిన బాధయేకాకుండ అనేకవిధములయిన జబ్బులుపోవును.— ఈబాధకు ప్రతిదినమును సాయంకాలమందును ఉదయకాలమందును చేయవలసిన చికిత్సమఱియొకటిగలదు. ఏమనగా—రాతిసున్నము ౧భాగము, నీళ్ళుమూడుభాగములు, కలిపి అనీళ్ళయినను—లేక మాచికాయలు చితుకకొట్టి మూడుతులములనర యెత్తు తీసికొని ఒకకుండలో అర్ధసేరునీళ్ళలోవేసి ౧౦ నిముషములవరకుకాచి చల్లారినపిమ్మట వడియకట్టి ఈకషాయములో అరతులముపటిక వేసికలిపి ఇదిఅయినను రబ్బరుపిచికారీతో లోపల అంతయువ్యాపించులాగున పిచికారీ చేయుచుండవలెను. పట్టిపటికపొడి కొంచెము గోరువెచ్చని నీళ్ళలోవేసి పిచికారీచేసినను సరే.

మర్మస్థానమందు మంటయును దురదయును, స్త్రీలకు ఎప్పుడైనను కలుగుచుండును. ముఖ్యముగా గర్భిణులకు నెలలునిండు కాలములో కలుగుటకలదు. ఇందుకు మొదట ఆహారవిషయములో నియమము చేయవలెను. అనగా కాకచేయు పదార్థములు ఆవాలు మిరెపకాయలు మొదలగునవి వేసినపదార్థములను పుచ్చుకొనగూడదు. ఇంతకంటె ఆవశ్యకమయినపని మఱియొకటి చేయవలయును. ఏమనగా స్నానమునకు ఉపయోగముగు తొట్టిలో ఒకదోసెడు ఉప్పువేసి దానిపైని చన్నీళ్లు ౩-౪ అంగుళముల యెత్తువరకుపోసి అటగోరువెచ్చనకాచగిన వేడినీళ్లు కూడపోసి దానిలో వస్త్రము లేకుండ (కావలసినయెడల పైనిమేదైన కప్పుకొని) కాళ్ళుచ్రి దయుంచి ఆతొట్టిలో రెండుమూడు నిముషములు మాత్రము కూరుచుండి లేవవలయును. ఇందువలన చాలగుణముగా నుండును.

గర్భస్రావము.

ఏడుమాసములు దాటకపూర్వము పిండము జారిపోయినయెడల నది గర్భస్రావము. అనగా కడుపు దిగిపోవుట అని చెప్పబడును. ఏడు మాసములుదాటి తొమ్మిదిమాసములు నిండక పూర్వము కాన్పువచ్చినయెడల అది అకాలప్రసవమని చెప్పబడును. కొందరు స్త్రీలకు ఈగర్భస్రావదోషము బాలాయముగాకలుగుచు సంతానము నిలవకయుండు శరీరము మిగుల బలహీనమగుచును ఉండును. అయినను ఇది సాధారణముగ కలుగకుండ చేసికొనుటకు కొన్ని యుపాయములున్నవి. ఒకసారి కలిగినయెడల ఇకనిలువుట కష్టముకావున నది తటస్థించక యుండునటుల జాగ్రత పుచ్చుకొనవలెను. ఈవిషయమయి కొన్ని సంగతులు దిగువనవ్రాయుచున్నాను. ఇట్టి అంశములు స్త్రీలకు తమంతట తమకు తెలియతగినవికావు. వారికి చెప్పతగిన వారెవ్వరును ఉండరు. వైద్యులను అడిగి తెలిసికొనుటకు లజ్జింతురు. గనుక నేనిక్రిందవ్రాసెడు విషయములను బాగుగాచదివి శ్రద్ధతోగ్రహించి సర్వదా జ్ఞాపకముంచుకొనవలెను. ఈగ్రంథమందు వ్రాసినసంగతులన్నియును ఇట్టివే. గనుక ఈగ్రంథమువంటి గ్రంథములయొక్క ముఖ్యతనుగూర్చి విశేషించి వ్రాయపనిలేదు. ఇట్టిజ్ఞానము స్త్రీలకు పరమావశ్యకము.—

గర్భస్రావమగుటకు కారణములు.—బహుస్వల్ప కారణముచేతనే గర్భముజారి శిశువృద్ధిబొంది పిండముపడిపోగలదు. ముఖ్యకారణములు కొన్ని వ్రాయుచున్నాను. చాలదూరము నడుచుట, మెరకపల్లములు గానుండు దారినిబండిమీదపోవుట, పొగబండిమీదవిశేషప్రయాణము చేయుట విశేషశరీరాయాసమును పొందుట, రాత్రులుచాల సేపుమేలుకొనుట, తరుచుగా సాంగత్యము చేయుట, ఏకారణముచేతనైనను పడుట, మనస్సునకు అకస్మికముగాకలుగు కోపము భయము మొదలగు భావములు, అలసట, అందనిది అందుకొనుట, అదిరిపడుట, మెట్లుయెక్కునప్పుడైనను దిగునప్పుడైనను అడుగుతప్పివేయుట, మెట్లమీదినుండి క్రిందికిపడుట, మిగులబరువైనవస్తువుల నెత్తుట, గాఢమయి వికారము కలుగచేయు విరేచనౌషధము పుచ్చుకొనుట. అత్యంత మలబద్ధము, శరీరదుర్బలత్వము, నృత్యము, రాత్రులు చాలసేపుమేలుకొనుట, బట్టబిగించి కట్టుకొనుట, మనస్సునకుగాని శరీరమునకుగాని అపాయకరమయిన యెట్టిదైనను సరే గర్భస్రావమును కలిగించును. పొగబండిమీద చాలదూరము ప్రయాణము చేయుట గర్భిణులకు ఎప్పుడును కూడనిదని నిశ్చయముగా నమ్మవలెను. ఇదియును బళ్ళప్రయాణములును మనవారు తరుచుగా చేయుచుందురు. గనుక అట్టిప్రయా

లము లేమి, పైని చెప్పబడిన కార్యాంతరము లేమి ప్రయత్నపూర్వకముగా మానవలెను.

గర్భస్రావచిహ్నలు.—ఇక రెండుమూడు దినములకు గర్భస్రావము కలుగు ననగా శరీరమంతయు జలపంతయుపోయి నిస్సత్త్వముగా నుండుటయును తొడలు గజ్జలు తుంట్లు గర్భముయొక్క క్రిందిభాగమును బలహీనమయి తోచకుండుటయును సంభవించును. ఈ చిహ్నలు కనబడినవెంటనే తగిన పరిహారము ఏమియు చేయక యూరకుండినయెడల ఒకటి రెండు దినములకు కొంచెము రక్తము స్రవించబోవునట్లు కనబడును. ఆవెంటనే రక్తము ప్రవాహముగానే బయలువెడలును. ఆవెలువడిన రక్తము గడ్డకట్టును. అప్పుడు ఇక గర్భస్రావము కలుగునుగదా అని భయపడవలయును. ఏమియు బాధకనబడదు. ఇట్టిస్థితిలోనైనను స్రావము కలుగకుండ తగినచికిత్స చేయవచ్చును. కలిగినను స్త్రీయొక్క శరీరమునకు దౌర్బల్యము మాత్రము కలుగకుండ చేయవచ్చును. అందువలన మరల స్రావము కాకుండును. ఈ చికిత్సయును కార్యకారి కాకపోయినయెడల గర్భస్రావము కలుగుట నిశ్చయము. అప్పుడు సంభవించుబాధలు కొంచెమెచ్చుతగ్గ ప్రసవవేదనవలెనే యుండును. నొప్పులారంభమగును. మొదట నవికొంచెముగాను అక్రమముగాను మెల్లనొప్పులుగా నుండును. మరికొంచెము సేపటికి హెచ్చయి, క్రమానుగుణముగాను క్రిందికి వ్యాపించునవిగా నుండును. గర్భస్రావము కలుగునప్పుడు రెండుపనులు తటస్థించును ౧. పిండము నిర్జీవమయి గర్భముయొక్క సంబంధమును వదలుట. ౨. పిమ్మట పైకివెడలిపోవుట. గర్భసంబంధము వదలుటలో కొన్నికొన్ని రక్తనాళములు తెగిపోవుట సంభవించును గనుక కొంచెము రక్తము ముందు స్రవించును. తరువాత గర్భమునుండి పిండము వెడలుటకు ముకుళీభావమును పొందుటచే నొప్పికలుగును. గర్భస్రావమగుటకు పిండవిశ్లేషము బహిర్గమనము తప్పక కలుగును. గనుక రక్తస్రావమును నొప్పియును కలుగక మానవు. ఒక్కొక్కప్పుడు ఈరక్తస్రావమును నొప్పియును అతిశీఘ్రముగా తగ్గును. అదెందువల్ల ననగా పిండము గర్భమునుండి వెలువడివచ్చి తద్ద్వారమందుండును. పిమ్మట కొంచెముసేపటికి దానంతట అదే ఇవతలకు వచ్చును. గర్భస్రావము ఎప్పుడైనను కలుగవచ్చునుగాని తరుచుగా ఎనిమిదవ వారమునకు పండ్రెండవ వారమునకు మధ్యకాలములో కలుగును. నాలుగవమాసమునకు ముందుకలిగిన యెడల దానివలన అప్పటికి పాయమేమియును కలుగదుగాని అందునుగూర్చి తగిన జాగ్రతపుచ్చుకొననియెడల శరీరమునకు స్థిరమయిన దౌర్బల్యాది హానులు కలుగ చేయును. నాలుగవమాసము గడచిన తరువాత సంభవించినయెడల రక్తస్రావ మెక్కువగును. వైద్యుని సహాయముచేత గుణమీయవచ్చును. గనుక వైద్యుని పిలి

పించకమానరాదు. ప్రసవవేదనవంటి నొప్పులు కలిగిన యెడలను రక్తస్రావ
మెక్కువయి పెద్దపెద్దకండలు బయలువెడలినయెడలను స్తనములు చిన్నవయి
మెత్తన అయినయెడలను అదివరకు వానిలోపలనుండు కొంచెమయిన స్రావము
చటుక్కున ఆరిపోయిన యెడలను కడుపు చల్లగాను బరువుగాను చిన్నదయి
పోవుచును ఉన్నయెడలను శిశుచలనమయిన వెనుక శిశువుయొక్క కదలిక కనబడక
పోయినయెడలను కడుపులో బరువైన యొకపదార్థము గిరగిరతిరుగుచు స్త్రీ
యేవైపునకుతిరిగిన అదియునుఆవైపునకే తిరిగినట్లున్నయెడలను లోపలినుండి యేమైన
నసహ్యాకరమయినది స్రవించినయెడలను గర్భములోనున్న పిండము నిర్జీవమయి
గర్భసంబంధమును వదలినదైంది ఇకగర్భస్రావమగునని నిశ్చయించవచ్చును. అట్టి
గర్భస్రావము ఒక్కొకప్పుడు అయిదారు దినములలోను ఒక్కొకప్పుడు పదునైదు
దినములలోను మరికొన్ని సమయములలో మూడు వారములలోను కలుగును.
అంతుల చిహ్నలు కనబడినవెంటనే వైద్యునికిమాత్రము వర్తమానముపంపి అగత్య
మయిన చికిత్సలు చేయించవలెను.. ... ఈవిషయమును జ్ఞాపకముంచుకొని నడుచు
కొనవలసిన కొన్నివిధుల నిచ్చట వ్రాయుచున్నాము. ప్రసవసంబంధమయిన చిహ్న
(అనగా తీగెబయలువెడలుట) యే మాత్రము కనబడినను వెంటనే పరుండవలెను.
ఆపడుకొనుటలో మెత్తని పరుపుమీదగాక పీచు లేక గుర్రపు వెండ్రుకలతో
తయారుచేయబడిన పరుపుమీద వెల్లకితలగాని ఒకప్రక్కనుగాని పరుండవలెను.
సాంగత్యము ఎంతమాత్రమును కూడదు. పురుషుని సమీపమునకైనను పోకూడదు.
పుచ్చుకొనుపదార్థములలో ఆరోరూటు సగ్గు ఈమొదలయిన తేలికపదార్థము
లను చలువచేయుచల్లనిపానము పచ్చిద్రాక్షపండ్లును పుచ్చుకొనవలెను. పరుండు
గదిలోకి చల్లనిగాలివచ్చునట్లు చేసికొనవలెను. విరేచనౌషధములు పుచ్చుకొన
గూడదు. రక్తస్రావము విశేషముగనున్నయెడల చన్నీళ్ళు మర్మస్థలమందు తరుచుగా
చల్లవలెను- గర్భములోనుండి వెడలివచ్చు పదార్థములనన్నిటిని బహుజాగ్రతగా
నుంచి వైద్యునికి చూపించవలెను. గర్భస్రావమోకాదో తెలిసికొనుటకు ఆపదా
ర్థములను బాగుగ పరీక్షించినయెడలగాని తెలియదు.గనుక లోపలినుండి పైకివచ్చిన
దైనను సరే శ్రద్ధతో దాచియుంచవలెను. రక్తపుకండలు వచ్చినను ఆశ్చర్యపడ
కూడదు. వానిని వైద్యుడుచూచి పరీక్షించిన తరువాత నేదైనదియు నిశ్చయించ
వలెను. గర్భస్రావమైనవెనుక. ప్రసవమయినవెనుక నెమ్మదిగా పరుండియుండు
విషయములోను పుచ్చుకొను ఆహార పదార్థముల విషయములోను ఎంత
జాగ్రతగానుండవలెనో అంత జాగ్రతగాను డుండవలెను. కొన్ని మాసముల వరకు

భర్తను మొదలయినవారిని వదిలివేసి ఒకరిద్దరు అనుకూలమయిన నౌకర్లను తీసికొని ఆరోగ్యమయిన యేదైనను పల్లెటూరికివెడలి యుండవలెను. శీఘ్రముగా లఘ్వాహారపదార్థములతో పథ్యముగా భోజనము చేయుచు కొంచెము వ్యాయామము చేయుచు రాత్రులు గుర్రపు వెంట్రుకల పరుపుమీద శీఘ్రముగా పరుండి నిద్రించుచుండవలెను. ప్రాతఃకాలమందు చన్నీళ్లతో స్నానముచేసి వెంటనే పొడిబట్టతో బాగుగా తుడుచుకొనుచుండవలెను. శీతకాలమయినయెడల గోరువెచ్చనినీళ్లతో స్నానముచేయవచ్చును. టొబ్బానాలో స్నానముచేయుట ఉత్తమము. ఆదివరకు గర్భిణిగానున్నపుడు టొబ్బానా స్నానముపనికిరాదు. గర్భిణిగానున్నతోడనే ప్రతిదినమును చాలసేపు పరుండితేయుండవలెను. మనస్సునెమ్మదిగా నుంచుకొనవలెను. రాత్రులు శీఘ్రముగా పరుండవలెను. విరేచనౌషధము పుచ్చుకొనగూడదు. విశేషమలబద్ధముగానుండి అగత్యమయినచో కొంచెము పట్టాముదము పుచ్చుకొనవచ్చును. కొంచెముదూరము నడిచివచ్చుచుండవలెను. పొగబండిమీద విశేషదూరము ప్రయాణముచేయకూడదు. సముద్రముమీద పొగయోడలోను పోగూడదు. తరుచుగా గర్భస్రావబాధకలుగు స్త్రీలకు ఆకాలము సమీపించు సమయము తెలియును గనుక పైనుదాహరించిన అంశములు బాగుగ జ్ఞాపకముంచుకొని అట్లు చేయుచు, వైద్యునికికూడ వర్తమానము పంపి చికిత్స చేయించుకొనవలెను.—

అబద్ధపు నొప్పులు.

గర్భిణులకు ముఖ్యముగా ప్రథమ గర్భవతులకు ఒక్కొక్కప్పుడు అబద్ధపు నొప్పులు వచ్చును. ఇవి తరుచుగా రాత్రులు జీర్ణకోశము క్రమముగానుండక పోవుట వలన గలుగును. ఇవి కడుపు, వీపు, గజ్జలకు వెనుకభాగములోను పుట్టి క్రమముగా తుంట్లు తొడలకు వ్యాపించును. ఒకప్పు డొకచోట మరొకప్పుడు మరొకచోట కనబడు చుండును. ఒకప్పుడు వచ్చిపోయి మరల వెంటనే వచ్చుటయు, మరొక్కప్పుడు మరల చాలసేపటివరకు రాకుండ పోవుటయు, ఒకప్పుడు కొద్దిగాను మరొకప్పుడు విశేషముగాను, ఉండును. ఈ నొప్పులు నిజమయిన ప్రసవవేదనలో కలుగు నొప్పులు అనగా క్రిందికి పొడుచుచున్నట్టు ఉండునొప్పులవంటివిగా నుండవు. ఇవి ప్రథమ గర్భవతులకే తరుచు కలుగును. ఇక రెండుమూడు వారములలో ప్రసవింతురనగా మరింత హెచ్చుగా కలుగును. రాత్రిభాగమందే వచ్చును గనుక బాగుగా నిదానించవలెనుగాని నిజమయిననొప్పులని తొందరపడకూడదు. కొందరుస్త్రీలు రెండుమూడు వారములవరకు ప్రసవ

వేదన పడిరని చెప్పుదురు. అది సరికాదు. ఒకవేళ అటువంటివిషయములలో మొదట అబద్ధపునొప్పులు కలిగియుండి అవ్యవధిగా పిమ్మట నిజమయిన నొప్పులు వచ్చియుండును. నిజమయిన ప్రసవవేదన అయినదియు కానిదియు తెలిసికొనుటకు ఈక్రింది యంశములను పరిశీలించవలెను. ౧. మాసములుపూర్తిగా నిండిన వెనుకను అనగా గర్భిణీకాలపరిమితి సంపూర్ణమయిన పిమ్మటగాని నిజమయిన నొప్పులు కలుగవు. అబద్ధపునొప్పులు అందుకు మూడు నాలుగు వారములకు ముందుగానే కలుగును. ౨. నిజమయిన ఆవేదన అయినయెడల తీగెతో నారంభమగును. అబద్ధపునొప్పులకది కనబడదు. ౩. అబద్ధపునొప్పులయిన యెడల క్రమము ననుసరించి యుండవు. మొదట గజ్జలలోను తరువాత పిరుదులయందును పిమ్మట కడుపుయొక్క మరియొక భాగమునందును ఈరీతిగా కలుగును. నిజమైన నొప్పులయినయెడల మొట్టమొదట వీపులో కనబడును. ౪. అబద్ధపునొప్పులు మూర్ఛవలె హఠాత్సంభవములుగానుండును. నిజమయిన నొప్పులు క్రమాభివృద్ధిగా హెచ్చుచున్నట్లుండును. ౫. అబద్ధపునొప్పులు ఒక్కొకసారి పాతికగంటమాత్రమె వ్యవధిగావచ్చును. మరియొకసారి గంట రెండుగంటలపర్యంతము తాళివచ్చును. ఒకసారి నొప్పి బహుదుస్సహముగాను మరొక్కపుడు కొద్దిపాటిదిగాను ఉండును. నిజమయిన నొప్పులు సమకాలవ్యవధిగలిగియును క్రమముగా హెచ్చుచును ఉండును. అన్నిటికంటెను ముఖ్యమయిన గురుతు నిజమయిన నొప్పులయినయెడల తీగె వచ్చును. కానియెడలరాదు. నిజమయిన నొప్పులారంభమయినప్పటెల్ల తీగె వచ్చుట కానమని కొందరందురుగాని అది సకృత్ప్రత్యక్షముగాని సర్వత్ర కాదు.—అబద్ధపునొప్పులకు చికిత్స ఆవశ్యకమయినచో కొంచెము చిట్టాముదము పుచ్చుకొనిన చాలును. అందువలన శాంతి చెందకపోయినయెడల అల్పాహారము పుచ్చుకొనుచు రాత్రులు నూనెలో హారతికర్పూరము వేసి పరుండునప్పుడు కడుపునకు రాసికొనుచుండవలెను. ఉప్పు వెచ్చచేసి పరుండు సమయములో కొంచెము కడుపుకు కాచుకొనినను గుణమిచ్చును. ఇట్టి అబద్ధపునొప్పులు శీఘ్రకాలములో నివారించనియెడల వైద్యునిపిలిచి యేదైనను ఔషధము పుచ్చుకొనవలెను.

మాసపూర్తి—పరిమాణము.

గర్భిణిగానుండు కాలము సర్వసాధారణముగా రెండువందల యెనుబది దినములని కనిపెట్టబడినది. అనగా నలుబది వారములు—పదిచాంద్రమాసములు—

తొమ్మిది సౌరమాసములు. సర్వసాధారణముగా అని అనుట రోగమువలన ననగా ఈప్రమాణమునకు అప్పుడప్పుడు కొంచెము హెచ్చుతగ్గులు కలుగుచుండును. ఒకడాక్టరుగారు అయిదువందల గర్భిణులయొక్క మాసపూర్తిని పరిశీలించగా గర్భోత్పత్తిఅయినతరువాత ౩౭ వ వారమందు ౨౩ రును ౩౮ వ వారమందు ౭౮ గురును ౩౯ వ వారమందు ౭౧ రును ౪౦ వ వారమందు ౧౩౧ రును ౪౧ వ వారమందు ౧౧౨ రును ౪౨ వ వారమందు ౬౩ రును ౪౩ వారమందు ౨౭ గురును ౪౪ వ వారమందు ౭ గురును ౪౫ వారమందారుగురును ప్రసవించునట్లు కనబడినది. ఇందును బట్టిచూడగా ౫౦౦ లమందిలోను కొంచెము తక్కువగా సగముమంది ౪౦. ౪౧ వారములలో ప్రసవించినట్లు కనబడుచున్నది. కాబట్టి ౨౮౦ దినములు సర్వసామాన్య పక్షముగా గణన చేసికొనవచ్చును. నెలలు లెక్కపెట్టుటలో కడపటిబహిష్ఠదినము లకు వెనుకననగా తరువాత ౨౮ దినములలోనైన సాంగత్యదినము మొదలు చేసికొని లెక్కపెట్టవలెను. ఎందువలననగా బహిష్ఠయైన పిమ్మట శీఘ్రకాలములోనగుకలియిక వలనగర్భోత్పత్తి తరుచుగా నగుచుండును. ఈకారణముబట్టియే ఒకప్రభువునకు చిరకాలమువరకును సంతానము కలుగనప్పుడు ఒకవైద్యునియాలోచన ననుసరించి భార్యబహిష్ఠయై స్నానము చేసిన వెంటనే కలిసికొనగా సంతానము కలిగెను.

గర్భోత్పత్తియైనపిమ్మట ప్రసవదినము కొంచెమెచ్చుతగ్గగా తెలియుట మిక్కిలి యావశ్యకము గనుక ప్రతిసారియు బహిష్ఠస్నానదినము వ్రాసికొనుచున్న యెడల ఆదినము మొదలుకొని ౨౮౦ వ దినమున ప్రసవసమయము తటస్థించునని యెంచుకొనవచ్చును. ఈప్రకారముగా చూచుకొనిన లెక్కదినములకు లోగానే ప్రసవమయిన యెడల స్త్రీసంతానమును పైగా అయిన యెడల పురుషసంతానమును కలుగునని నిశ్చయించవచ్చును. ఇదివరకు కనిపెట్టుకొనియున్నప్పటికి అతిస్వల్ప కాలములో ప్రసవమయినచో ౨౮ వారములకును విశేషవ్యవధి అయిన యెడల ౪౫ వారములకును అగుట సకృత్పక్షముగానున్నది. ౨౬ వారములకే కనుట ౧.౨ విషయములలో వింటిమిగాని అట్టిశిశువులు జీవింపలేవు. కొందరు స్త్రీలు ప్రసవించినవెనుక మరల కొద్దికాలముకే గర్భిణులగుదురు. అట్టివిషయములో నెలతప్పుట యను సులభసాధనము ఉండదు గనుక గర్భోత్పత్తికాలమును దానినిబట్టి మాస పూర్తిని కనుగొనుట బహుకష్టముగానుండును. కాబట్టి ఈరీతిగా గర్భమయి నప్పుడు శిశుచలనకాలమునుబట్టి మాసనిర్ణయము చేసికొనవచ్చును. ఆకాలమునకు గర్భిణిదినములు ఇంచుమించుగా సగముఆగును. శిశుచలనదినమునకు సరిగా నూట యిరువదినాలుగు దినములగుట సర్వసామాన్యముగ కనిపెట్టబడినది. గనుక ఆదిన

ము బాగుగా గుర్తెరిగినయెడల అది మొదలుకొని నూటయేబదిఆరు దినములకు ప్రసవసమయము తటస్థమగును....... గర్భవతులయిన పిమ్మట నెలదినములకు అనగా బహిష్ఠగు దినములలోనే బహిష్ఠయినప్పుడు కలిగినవలెనే రక్తము, తీగెయు స్రవించును. దీనినిజూచి మామూలుప్రకారముగానయిన రజోపమోచనమే అనుకొని అటుపిమ్మటనేగర్భమైనట్లెంచి మాసనిర్ణయములో ఒకనెల తక్కువచూచుకొందురు. అట్టిస్రావము మామూలుగానగు రజస్సగునా కాదాయని నిరూపించుటలో మూడులక్షణములు కనిపెట్టవలెను. ఏమనగా పైనిచెప్పబడిన స్రావము మామూలు రజస్సుకంటె కొద్దిగాను గడ్డకట్టుమను కొన్నిగంటలవరకు మాత్రమే యుండునదిగానుండును. ఇది తెలిసికొని బహిష్ఠగుటకాదని గ్రహించి మాసనిర్ణయము చేసికొనవలెను. ఈగర్భోత్పత్తి కాగానే అనగా అందుకు కారణమైన బిందుపతనము కాగానే గర్భము అనగా శిశువృద్ధికొరకు యేర్పడినకోశము గట్టిగా మూసికొని పోవును. గనుక పూర్వోక్తస్రావము గర్భమునుండి కానేరదు. గర్భమునకు ద్వారము యొక్క పైభాగమునుండియు ఆసమీపమునుండిమాత్రమేఅదివెలువడును.

మగశిశువో ఆడుశిశువో తెలిసికొను విషయము.

ఈఅంశములో నిశ్చయించి చెప్పుటకు వీలులేదుగాని సాధారణముగా బహిష్ఠఅయిన పిమ్మట మొదటి పదునేను దినములలో గర్భోత్పత్తిఅయినయెడల ఆడుశిశువును రెండవ పదునేనుదినములలో నయినయెడల మగశిశువును కలుగును. ఇందునుబట్టియే మనవారు మగశిశువును ఎక్కువకాలము మోయుదురని అనుకొనుచుందురు. నెల తప్పినముందు నెల మొదటినుండియును లెక్కచూచుకొను వాడుకనుబట్టి ఆనెలలో ఒవరదినములలో గర్భోత్పత్తి అయినప్పుడు ప్రసవదినములు ఆలస్యముగా వచ్చినట్లు కనబడునుగాని అది యెక్కువకాలము మోయుటకాదు. ఈవిషయము అనగా మగశిశువో ఆడుశిశువో నిశ్చయముగాచెప్పగలమను వారిమాటలు వట్టిబూటకములుగాని శాస్త్రీయ సారమయినవి కావు. గర్భము యొక్క ఔన్నత్యమునుబట్టియు స్థితినిబట్టియు కుడి యెడమపార్శ్వముల హెచ్చుతగ్గునుబట్టియు ముఖచిహ్నములను బట్టియు ఆరోగ్యస్థితినిబట్టియు చెప్పవచ్చుననుట వట్టిభేషజముగాని ప్రశస్తముకాదు. భగవన్నియమమేమో తెలియదుగాని ఆయా దేశముల జనాభాలెక్కలనుబట్టిచూడగా నూటికిఅయిదుగురుచొప్పున ఆడువాండ్రకంటె మగవాండ్రెక్కువ జన్మించుచున్నట్లుమాత్రము కనబడుచున్నది. ఈస్వల్పపు హెచ్చుతగ్గుతప్ప స్త్రీపురుషజననముల సంఖ్యసమముగానేయున్నది. [సశేషము.]

హండి- రామారావు.

రావుబహదూరు కందుకూరి-వీరేశలింగముగారి సమ్మానము.

దొరతనమువారు నూతన సంవత్సరారంభమునందును శ్రీ మహారాజ్ఞిగారి జన్మదినమందును తమ పరిపాలనకు లోబడిన ఘనతగాంచిన జనుల గౌరవార్థముగా నేటేట బిరుదునామము లిచ్చుచుందురు. ఇట్టి బిరుదాభిధానములలో నొకటగు రావుబహదూరను బిరుదు నీసంవత్సరారంభమున మన పురనివాసులగు మహారాజశ్రీ కందుకూరి వీరేశలింగము పంతులుగారికి దొరతనమువారిచ్చినారు. కష్టనిష్ఠురములకు లోనై మితిమీఱిన ప్రయాసముల కోర్చి కష్టసాధ్యములగు కార్యముల నెరవేర్చుచున్న యీపంతులవారు దొరతనమువారిచే సమ్మానింపఁబడుట ఆయన కొకవేళ గొప్పకాకపోయినను, మనపురజనులలో నొక్కరు గౌరవింపఁబడుట ఈరాజమహేంద్రవర పురజనులకు గౌరవావహమని చెప్పనచ్చును. అందుచే నీపంతులవారిని గౌరవించుటకయి యీరువారిని సమావేశము చేసి, యిక్కడి (రీడింగ్‌రూమ్) పఠనమందిర సమాజమువారు కడచిన నెల 2౧వ తేది శనివారము నాటి సాయంకాలము టవునుహాలులో సభ చేసిరి. ఆం దిచ్చటి రాజకీయ శాస్త్ర పాఠశాలాధ్యక్షులగు శ్రీ మెట్కాఫు దొరవా రగ్రాసనాధిపతులుగ నుండిరి. రీడింగురూము కార్యదర్శిగారు నాటి సభయొక్క యుద్దేశమును చెప్పిన వెనుక మహారాజశ్రీ ఆచంట సుందరరామయ్యగారు పంతులవారివిషయమై కొంచెము చెప్పి ముగించిరి. మ॥ కొలచిన అప్పయ్యదీక్షితులుగా రటుపయిని పంతులుగారివిషయమయి చక్కని యంశంబులతోఁ గను, మృదుమధురశైలితోడను గొప్పయుపన్యాసము చేసి సభను మెప్పించిరి. అటుపిమ్మట రాజమహేంద్రవరపు ప్రార్థనసమాజమువారి యనుమతిని మహారాజశ్రీ గోటేటి కనకరాజుగారు నొక కొన్నియంశంబులఁ జెప్పిన పిమ్మట, మ॥ వావిలాల వాసుదేవశాస్త్రిగారు మొదటి పద్యముయొక్క పాదముల యాద్యంతాక్షరము చదివినచో "రాయబహదూర కందుకూరి వీరకవికొమ్మ" అని యేర్పడునట్లుగా రచించి యీ క్రింది పద్యముల నంపి చదివించిరి.

సీ॥ రాజమహేంద్రవరమున జిల్లాస్కూలులోఁ బ్రవేశపరీక్ష లోఁదుదేలియుఁ
బాలికావిద్యాది బహునూత్న కళలను దేశాన వెలయింపఁ దీవ్రసాహ
దూరంబుగాఁ బోవ దొసఁగులాంధ్రంబున వచనంబు నెలకొల్ప వలచి కూర్చ
కందుక క్రీడాదికము లాడెనెల్లని గంభీరహృదయుఁబు గనఁగమీఁదు
కూడులేని ప్రజలపయిఁ గూర్మి గూర్చి
కీటికెడి అచ్చుచావడి వీడి వార
కమలముఖులను దళ్ళాల ఘనులపదవి
కొలుచు గఱవ యితండనుకోఁడి నమ్మి.

ఆ॥వె॥ రాజమాన్య రాజపూజితులైనట్టి ప్రభుల వంశమందుఁ బ్రభవమొంది
రాజదత్తబిరుద పూజితుఁడైన యీ హితుఁడు వెలయుఁగాత మెల్లకడల!!

అటుపిమ్మట మహారాజశ్రీ చిలకమర్తి లక్ష్మీనృసింహమూర్తిగారు క్రింది పద్యములు మిగుల హృద్యంబుగఁ జదివి సభను మెప్పించిరి.

పుష్పమాల.

సీ॥ శ్రీకందుకూరి మహాకులచంద్రుండు పుణ్య సుబ్రహ్మణ్య పుత్రకుండు
శోభితాపస్తంబ సూత్ర సంభూతుండు వర లోహితస గోత్రపావనుండు
రాజమహేంద్ర వరపురీనివాసుండు రాజకీయోద్యోగ పూజితుండు
శ్రీపునఃపరిణయ స్థాపనాచార్యుండు సర్వాంధ్రలక్షణ సంవిదుండు
మృదుకవిత్వ విశారదుం డుదితగుణుఁడు। పృథ్వి వీరేశలింగాఖ్య విశ్రుతుండు
అతఁడు రావుబహద్దరై యలరుచుండె। హిందువుల డెందములు మహానందమంద.

సీ॥ ధవళేశ్వరమునందు ధవళాంశునిభమైన ధవళకీర్తినిగన్న ధన్యుఁడెవరు
తేనెతేటలఁబోలు తీయమాటలతోడ వరకవిత్వముఁ జెప్పు సరసుఁడెవరు
రాజమహేంద్రనగర రాజకళాశాలఁ దెనుఁగుపండితుఁడైన ధీరుఁడెవరు
బహుదేశములయందుఁ బలుజనంబులచేతఁ గీర్తింపఁబడునట్టి మూర్తియెవరు
వర నిగర్వచూడామణి ప్రవరుఁడెవరు। పృథ్వి వీరేశలింగాఖ్య విశ్రుతుండె
అతఁడు రావుబహద్దరై యలరుచుండె। హిందువుల డెందములు మహానందమంద.

సీ॥ దానకంకణమూనుచు స్తవమొనర్పఁగనేల నగరమందిరమిట్లు సొగసుమిగుల
కవితావిలాసంబు గణుతిసేయఁగనేల యభినవ తిక్కనాహ్వయముఁ గలుగ
జగదుపకారంబు సంస్తుతింపఁగనేల ఘనపునఃపరిణయ కథలుగలుగ
దేశాభిమానంబు దెలియఁ జేర్కొననేల తెనుఁగుబాసనుఁ జాలఁ దేటపఱుప
నింకఁ దక్కిన గుణముల నెన్ననేల। దొరతనమువారె సాత్త్విలాసరసమతికి
అతఁడు రావుబహద్దరై యలరుచుండె। హిందువుల డెందములు మహానందమంద.

సీ॥ సంఘమతాచార సంస్కారమొనరించె వారకాంతల గౌరవంబుమాన్పె
నాంధ్రవిద్యలయందు నభిరుచిపుట్టించె దేశీయసభఁ గూర్చి తెలియఁబల్కె
నీతిమార్గంబుల నియతిబోధనసల్పెఁ గడు నుపన్యాసముల్ గరిమనిచ్చె
గవరరాజాఖ్యుని నవని శాశ్వతుఁ జేసె నగరమందిరమిచ్చె నాగరులకు
నలిమె వర్ణింపఁగారాని చర్యలెల్ల। పృథ్వి వీరేశలింగాఖ్య విశ్రుతుండు
అతఁడు రావుబహద్దరై యలరుచుండె। హిందువుల డెందములు మహానందమంద.

సీ॥ రాజశేఖరచరిత్రము వ్రాయనేర్పరి కవులసంగతిఁ గూర్చు కవివరుండు
శారీరశాస్త్రంబు సంతరించినమేటి చిత్రకావ్యంబులఁ జెప్పఘనుఁడు
వచనప్రబంధముల్ రచియించు చదువరి తర్కంబుఁ దెనిఁగించు ధన్యమూర్తి

నవ్యశాకుంతల నాటకనిర్మాత బహుమతగ్రంథముల్ వ్రాయుప్రౌఢ
శంకరాచార్య చరితంబు సంగ్రహించి। వ్రాయుకిట్టరి ప్రహసన రచనకర్త
అతఁడు రావుబహద్దరై యలరుచుండె। హిందువుల డెందములు మహానందమంద.

సీ॥ న్యాయాధికారు లన్యాయమిచ్చెడుచోట లంచముల్ ఘనులు గ్రహించుచోట
వేశకాంతలఁ జాలఁ బ్రేమఁ జూచెడుచోట సన్మార్గవర్తనల్ చచ్చుచోట
గర్భవిచ్ఛేదముల్ గావించుకొనుచోట శిశుహత్యలను జాలఁ జేయుచోట
కన్యకావిద్యల గౌరవింపనిచోట బాల్యవివాహముల్ ప్రబలుచోట
ధర్మసంస్థాపనముఁ జేసి తగవు దెలిపె। పృథ్వి వీరేశలింగాఖ్య విశ్రుతుండు
అతఁడు రావుబహద్దరై యలరుచుండె। హిందువుల డెందములు మహానందమంద.

సీ॥ శాస్త్రపరీక్షలఁ జదివి కృతార్థులై వాదించు శ్రీ న్యాయవాదులైన
తూగుటుయ్యేలలందు నూగులాడుచునుండు ప్రాభవస్ఫూర్తులౌ రాజులైన
లెక్కింపఁగారాని రొక్కమార్జనఁ జేసి పౌలస్త్యు నెదిరించు వణిజులైన
కట్టింపఁజాలని ఘనమందిరంబును దయచేసె మనకెల్ల దానముగను
నెలకుఁ దా నేఁబదియె రూప్యముల గణించు। తెనుఁగు పండితుఁ డొక్కఁడు ధీరులార!
అతఁడు రావుబహద్దరై యలరుచుండె। హిందువుల డెందములు మహానందమంద.

ఉ॥ ఈసమయంబునందు మన కింపు జనింపుచునుండ సభ్యులా
రా! సుఖలీలల న్గవరరాజు సజీవుఁడుగానె యున్న నీ
హా సుఖమెట్టులుండఁగలదో గద యోచనసేయ నక్కటా!
యీసుకృతంబు చేసికొననైతి మదృష్టవిహీనతం గదుఙ్.

గీ॥ ప్రకటరాజమహేంద్రపుర నాటకసమాజ। పక్షమునఁ బుష్పమాల నర్పణముఁ జేసె
చిలకమర్తి లక్ష్మీనరసింహమూర్తి। హిందువుల డెందములు మహానందమంద.

ఆవల మ॥ గోపిసెట్టి నారాయణస్వామినాయఁడుగారును తరువాత మ॥ నల్లగొండ కోదండరామయ్యగారును ఏతద్గౌరవమునుగూర్చి కొంత చెప్పినపిదప పోలవరపు జమీందారుగారగు మహారాజశ్రీ శ్రీరాజా కొచ్చెర్లకోట రామచంద్ర వేంకటకృష్ణారావు బహద్దూరుగారు పంతులుగారి పటమును టవునుహాలునకు బహుమానముగ నొసంగి పంతులుగారి కార్యములయందుఁ దమకుఁగల యిష్టమును తాము చేయఁబూనిన సాహాయ్యమును వెల్లడించిరి. అనంతర మగ్రాసనాధిపతులగు శ్రీ మెట్కాఫ్ దొరవారు సంగ్రహముగా వినోదకరమును నీతిబోధకము నయిన యుపన్యాసము చేసిరి. ఇదియంతయు ముగిసినపిమ్మట శ్రీ వీరేశలింగము పంతులుగారు నమ్రతతో నగ్రాసనాధిపతిని సమీపించి సభవారిచేతను దొరతనమువారిచేతను తాము పడసిన

గౌరవమునకుఁ దాము కృతజ్ఞులుగ నున్నామనియు, తామట్టి గౌరవమునకుఁ దగిన వారము గామనియు తమ కావాక్యములన్నియు ముఖస్తుతులవలె నుండెననియు చెప్పి ముగించిరి. శ్రీ వీరేశలింగము పంతులుగారప్పుడును పరలోకగతులైన తమ మిత్రులగు బసవరాజు గవర్రాజుగారిని మఱువలేదు. ఆ మందిరమునఁ దమ సరసను నిలువఁబడి యుండిన యాసదస్యులు సజీవునిగ నాడుచూచునట్టి లాభము గలుగనందులకయి మిగుల విచారించిరి.

కృతివిమర్శనము.

"మంజువాణీవిజయము"—మదరాసు హైకోర్టు వకీలుగారైన బ్రహ్మశ్రీ మ॥రా॥శ్రీ॥ రాయబహద్దూర్ పనప్పాకం అనంతాచార్యులు బి.యల్. గారిచే రచింపఁబడినట్టియు, నేతద్గ్రంథకర్తగారిచేఁ బ్రచురింపఁబడుచున్న 'చమత్కారతరంగిణి' యను పేరఁ బరగుపుస్తకావళిలో రెండవదియునగు మంజువాణీవిజయమను ఆంధ్రగద్యప్రబంధము మాకుఁ జేరినది. ఈగ్రంథము మృదువైన శైలిని వ్రాయఁబడినది. అచ్చటచ్చట కొంచెము కఠినమయిన శైలిని వ్రాయఁబడినను, మొత్తముమీఁద నీపుస్తకము సర్వజన సామాన్య గ్రాహ్యముగా నున్నది. శ్రీ అనంతాచార్యులవారిట్టి జనోపయుక్తమయిన పనిచేఁ బూని యాంధ్రభాషను వృద్ధిచేయుటకయి ప్రయత్నించుచున్నందుకు మేమెంతయు సంతసించుచున్నారము. ఆంధ్రభాషయందు వచన ప్రబంధము లనేకములు గానరావు. ఇట్టిస్థితిలో మృదుమధుర శైలిని వ్రాయఁబడిన ప్రబంధములు సర్వజనాహ్లాదకరములయి యుండుననుట కెంతమాత్రము సందియము లేదు. సర్వకళాశాలా పరీక్షలకుం బోవువారలకుఁగూడ మిగుల నుపయోగకరములుగా నుండును. ఈగ్రంథకర్తగారీపనియందుఁ జేయు ప్రయత్నములన్నియు నిర్విఘ్నముగా కొనసాగించుటకు సర్వేశ్వరుని ప్రార్థించుచున్నాము.

నీతివాక్యరత్నాకరము—విశాఖపట్టణము డిస్ట్రిక్టుకోర్టు ట్రాన్సులేటరు గారయిన మునిషీ షేకుమవ్లాగారిచే రచింపఁబడిన నీతివాక్య రత్నాకరముయొక్క రెండుసంపుటములు మాకందినవి. ఫారసీ, హిందుస్థానీ, తెనుఁగు, సంస్కృతము, మొదలగు భాషలలోని పండితులచేత వ్రాయఁబడిన నీతిగ్రంథములనుండి యీగ్రంథము వ్రాయఁబడినది. మనయాంధ్రభాషలో సామెతలు మొదలగునవి యనేకములున్నను, అవియన్నియు నొక్కగ్రంథములోఁ జక్కగా వ్రాయఁబడియుండలేదు. నీతివాక్యములను సులభశైలిగా బాలురనిమిత్త మీగ్రంథకర్త పొందుపరచినాఁడు. ఇట్టిగ్రంథము బాలురకును వృద్ధులకును గూడ మిగుల నుపయుక్తముగా నుండుననుట కెంతమాత్రము సందియము లేదు.

ప్రకటన.

ఈ పుస్తకముల విక్రయమువలన వచ్చెడుసొమ్మంతయు గడచిన మూడుసంవత్సరములనుండియు రాజమహేంద్రవరమున జనుల యుపయోగమునిమిత్తము క్రొత్తగాకట్టఁబడిన పట్టణమందిరము (టౌన్ హాలు) నిమిత్త మిచ్చివేయఁబడుచున్నది. ఆమందిరమును కట్టించుటకై యించుమించుగా రెండువేలరూపాయల ఋణముకూడ అయినది. ఈఋణము తీఱువఱకును ఈపుస్తకముల అమ్మకమువలన వచ్చెడియాదాయమంతయు ఇచ్చివేయఁబడును. ఈపుస్తకముల పట్టికను దయచేసి మీరు మీ మిత్రులకును పరిచితులకును చూపుఁడు.

రాజమహేంద్రవరము
ఫిబ్రవరి నెల 1893.

కందుకూరి-వీరేశలింగము.

రాజమహేంద్రవరములోని శ్రీ వివేకవర్ధనీ కార్యస్థానమున వెలకుదొరకు పుస్తకములు, అంచెకూలితో

	రు.అ.పై.
నీతిచంద్రిక, విగ్రహము. (హితోపదేశము ననుసరించి కఠినశైలిని వ్రాయఁబడిన వచనకావ్యము.)	౧- ౨-౦
నీతిచంద్రిక, సంధి. (విగ్రహముయొక్క తరువాతిభాగమయిన వచనకావ్యము.)	౦- ౬-౬
సత్యరాజాపూర్వదేశయాత్రలు, మొదటిభాగము. ...	౦- ౬-౬
అభిజ్ఞానశాకుంతలము. (కాళిదాసుని నాటకమునకు తెలుఁగు) ...	౦-౧౩-౮
రత్నావళి. (శ్రీ హర్షదేవవిరచితమైన సంస్కృతనాటకమునకు తెలుఁగు.)	౦- ౬-౬
మాళవికాగ్నిమిత్రము. (కాళిదాసప్రణీతమైన నాటకమునకు తెలుఁగు.)	౦- ౬-౬
ప్రబోధచంద్రోదయము. (కృష్ణమిశ్ర విరచిత సంస్కృతనాటకమునకు తెనుఁగు.)	౦- ౭-౬
రాగమంజరి. (ఇంగ్లీషుననుసరించి తెలిఁగింపఁబడిన వింతయైన నాటకము.)	౦- ౭-౬
ప్రహ్లాదనాటకము. (భక్తిప్రధానమయిన వచనరూపనాటకము.) ...	౦- ౪-౬
చమత్కారరత్నావళి నాటకము.	౦- ౪-౬

రు.అ.పై.

బ్రాహ్మవివాహము. (అతిబాల్యవివాహమువలని నష్టములను దెలుపు నాటకము.) ... ౦- ౩-౬

వ్యవహారధర్మబోధిని. (న్యాయసభలలోని యక్రమములను బోధించు నాటకము.) ... ౦- ౩-౬

కౌతుకవర్ధని. (హాస్యప్రధానమయిన చిన్ననాటకము.) ... ౦- ౨-౦

హాస్యసంజీవని, రెండవభాగము. (వివేకవర్ధనిలోనుండి తీసి ప్రకటించిన హాస్యసంభాషణలు.) ౦- ౪-౬

తిర్యగ్విద్వన్మహాసభ. (బొమ్మలతోనున్న హాస్యసంభాషణ.) ... ౦- ౨-౬

వెనీసువర్తకచరిత్రము. (షేక్స్పియర్ నాటకమునుండి ద్విపదకావ్యముగా రచియించిన ప్రథమద్వితీయాంకములు.) ౦- ౪-౬

ఇంగ్లీషుప్రహసనముల ననుసరించి వ్రాయఁబడిన వింతలయిన హాస్య నాటకములు.

౧ అపూర్వబ్రహ్మచర్యప్రహసనము. ౦- ౨-౬
౨ విచిత్రవివాహ ప్రహసనము. ౦- ౨-౬
౩ మహాబధిరప్రహసనము. ౦- ౨-౬
౪ పునర్మరణ ప్రహసనము. ౦- ౨-౬
౫ బలాత్కారగానవినోద ప్రహసనము. ౦- ౨-౬
౬ కలహప్రియాప్రహసనము. ౦- ౨-౬
౭ మహామహోపాధ్యాయప్రహసనము. ౦- ౨-౬
౮ యోగనిద్రాప్రహసనము. ౦- ౨-౬
౯ మహావంచక ప్రహసనము. ౦- ౨-౬
౧౦ అసహాయశూరప్రహసనము. ౦- ౨-౬

అభాగ్యోపాఖ్యానము. (పద్యరూపమునయున్న హాస్యప్రబంధము.) ... ౦- ౨-౬

శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధము. (అచ్చతెలుఁగు నలచరిత్ర పద్యకావ్యము.) ... ౦- ౪-౬

రసికజనమనోరంజనము. (అపురూపమయిన అచ్చతెలుఁగు శృంగార ప్రబంధము.) ... ౦- ౪-౬

కవిరాజమనోరంజనము. (పురూరవశ్చరిత్రము. వింతయైన శృంగారప్రబంధము.) ... ౦- ౯-౦

మొల్లరామాయణము. ౦-౧౧-౦

పత్రికావిలాసము. ౦- ౪-౬

	రు. అ. పై.
బాలగీర్వాణ చేటగీతలు.	౦. ౧-౬
నీతిదీపిక. (బాలురనిమిత్తము చేయఁబడిన నీతిపద్యములపుస్తకము.) ...	౦- ౨-౬
స్త్రీనీతిదీపిక. (బాలికలనిమిత్తము చేయఁబడిన నీతిపద్యముల పుస్తకము.)	౦- ౨-౬
చంద్రమతిచరిత్ర. (స్త్రీలకు మిక్కిలియుపయుక్తమైన నీతిబోధకపుస్తకము)	౦- ౪-౬
సత్యవతిచరిత్రము. (స్త్రీలకు ఉపయుక్తమయిన కల్పితకథ.) ...	౦- ౪-౬
సత్యసంజీవని. (స్త్రీల కుపయోగించెడి నీతిబోధకమయిన కథ.) ...	౦- ౪-౬
సత్యాద్రౌపదీసంవాదము, మాతృపూజ & పితృపూజ. ...	౦- ౧-౬
సంగ్రహవ్యాకరణము. (పరీక్షలకుపయోగించు సులభమయిన తెలుఁగు వ్యాకరణము.	౦- ౫-౬

ఈక్రిందిపుస్తకములు సమకాలికుండును షేక్స్పియరను మహాకవియొక్క నాటకకథల ననుసరించి వ్రాయఁబడిన మనోహరములయిన కథలు.

౧ చమత్కారరత్నావళి.	౦- ౨-౬
౨ కుభంగేశ్వర వర్తకచరిత్రము.	౦- ౨-౬
౩ కళావతీపరిణయము.	౦- ౨-౬
౪ గయ్యాళినిసాధు చేయుట.	౦- ౨-౦
౫ రఘుదేవరాజీయము.	౦- ౩-౬
౬ చిత్రకేతుచరిత్రము.	౦- ౨-౦
౭ సుమిత్రచరిత్ర.	౦- ౨-౦
౮ దానకేసరివిలాసము.	౦- ౨-౦
౯ సరిమణీవిజయము.	౦- ౨-౦
౧౦ వైదర్భీవిలాసము.	౦- ౨-౬
౧౧ భానుమతీకల్యాణము.	౦- ౨-౬
శారీరశాస్త్రసంగ్రహము. (వైద్యులకును జనసామాన్యమునకును గూడ మిక్కిలి యుపయుక్తమయి పటములతోఁ బ్రకటింపఁబడిన శరీరతత్త్వమును తెలుపుగ్రంథము.) ...	౧- ౧-౦
ఆంధ్రకవులచరిత్రము, మొదటిభాగము.	౦-౧౧-౦
దేహారోగ్యధర్మబోధిని. (స్త్రీలకును పాఠశాలలకును అత్యంతోపయుక్తమయిన శరీరారోగ్య ధర్మములను బోధించు పుస్తకము.	౦- ౪-౬
ఉపన్యాసమంజరి. (మతవిషయకములును నీతివిషయకములునైన చిన్నయుపన్యాసములు గలది.) ...	౦- ౬-౬
అథర్వణకారికలు. (తెలుఁగువ్యాకరణమునుగూర్చిన సంస్కృతశ్లోకములు.)	౦- ౨-౬

		రు.అ.పై.
	ఆంధ్రతర్కసంగ్రహము. (అన్నంభట్టకృతమయిన తర్కసంగ్రహము తెలుఁగు.) ...	౦-౧-౬
	కావ్యసంగ్రహము.	౦-౨-౦

ఈ క్రిందివి బ్రహ్మశ్రీ కందుకూరి వీరేశలింగముగారిచే నప్పుడప్పుడు చేయఁబడుచువచ్చిన యుపన్యాసములు.

౧	వేశ్యాకాంతలయుపన్యాసము.	౦-౨-౦
౨	అతిబాల్యవివాహము.	౦-౧-౬
౩	విగ్రహారాధనము.	౦-౨-౦
౪	ఏకపత్యము.	౦-౧-౬
౫	ఈశ్వరదత్తపుస్తకములు.	౦-౨-౦
౬	దానములు.	౦-౧-౬
౭	స్త్రీపునర్వివాహచరిత్ర.	౦-౧-౬
౮	స్త్రీపునర్వివాహ విషయకోపన్యాసము.	౦-౨-౬
౯	స్త్రీపునర్వివాహవిషయక ప్రథమవిజ్ఞాపనము. ..	౦-౨-౬
౧౦	స్త్రీపునర్వివాహవిషయక ద్వితీయవిజ్ఞాపనము. ...	౦-౨-౬
౧౧	స్త్రీపునర్వివాహ శాస్త్రసంగ్రహము.	౦-౩-౬
౧౨	స్త్రీపునర్వివాహవ్యాపారముయొక్క భూతవర్తమానస్థితులు.	౧-౧-౬
౧౩	సకాయకష్టకర్తలు.	౦-౧-౬
౧౪	దేశీయమహాసభయు దానియుద్దేశములును. ...	౦-౪-౬
౧౫	జన్మాంతరము.	౦-౨-౬
౧౬	స్వయంకృషి.	౦-౨-౦
౧౭	ఈశ్వరోపాసనము.	౦-౨-౬
౧౮	శంకరాచార్యులు.	౦-౧-౬
౧౯	హిందూమతములు.	౦-౧-౬
౨౦	ప్రార్థన.	౦-౧-౬
౨౧	మానుషధర్మము.	౦-౨-౦

పయిపుస్తకములు కావలసినవారు, గోదావరిజిల్లా, రాజమహేంద్రవరము, శ్రీవివేకవర్ధనీ ముద్రాక్షరశాల మేనేజరుగారికి వ్రాసి, తెప్పించుకోవచ్చును.